సంద్రంలో ప్రమాదం

- మత్స్యకారుల బోటును ఢీకొన్న పర్యాటక శాఖ బోటు
- త్రుటిలో తప్పిన ముప్పు
- ప్రాణాలతో బయటపడిన మత్స్యకారులు, సందర్శకులు -7లో



పర్యాటక శాఖ బోటు

డెయిరీపై లోతుగా విచారణ

శాసనసభ కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ

- ఫ్యాక్టరీస్ అధికారులు, ఆర్థిక రంగ నిపుణులను కూడా కమిటీలో చేర్చి మరోసారి పూర్తిస్థాయిలో పరిశీలన
- అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు
- పాడి రైతులకు, కార్మికులకు న్యాయం చేస్తామని ప్రకటన
- విశాఖ డెయిరీని సందర్శించిన కమిటీ
- ఎండీపై ప్రశ్నల వర్షం

గాజువాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ అక్రమాలపై మరింత లోతుగా విచారణ జరిపి పాడి రైతులకు, కార్మికులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని శాసనసభా కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ అన్నారు. ఇటీవల జరిగిన శాసనసభా సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు విశాఖ డెయిరీ అక్రమాలను ఎండగట్టగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సభా సంఘాన్ని నియమించిన సంగతి తెలిసిందే. జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన సభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బొండా ఉమామహేశ్వరరావు, గౌతు శిరీష, ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, దాట్ల సుబ్బరాజులు సోమవారం నగర పరిధిలోని షీలానగర్‌లో గల డెయిరీని సందర్శించారు. డెయిరీ ఎండీ ఎస్‌వీ రమణ, డైరెక్టర్లను విచారించారు. డెయిరీ కార్యకలాపాలపై ఆరా తీశారు. ఆర్థిక వ్యవహారాలపై ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో చైర్మన్ నెహ్రూ మాట్లాడారు.

విశాఖ డెయిరీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పాడి రైతులు, కార్మికుల నుంచి పలు ఫిర్యాదు అందాయని, వాటన్నింటిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నామన్నారు. కంపెనీ చట్టాలు, కో-ఆపరేటివ్ రంగం, ఆర్థిక రంగ నిపుణులను కూడా కమిటీలో చేర్చి త్వరలో మరోసారి పూర్తిస్థాయి విచారణ జరుపుతామన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు డెయిరీ కార్యకలాపాలు సమర్థంగా జరిగే విధంగా చూస్తామన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ డెయిరీ వల్ల అటు పాడి రైతులు, ఇటు కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం విచారణకు ప్రత్యేక ... మిగతా 6వ పేజీలో



విశాఖ డెయిరీ సందర్శిస్తున్న శాసనసభా సంఘం చైర్మన్ జ్యోతుల నెహ్రూ, సభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బొండా ఉమామహేశ్వరరావు, గౌతు శిరీష, తదితరులు

డెయిరీ విచారణ జరిగిన తీరు...

కమిటీ చైర్మన్: విశాఖ డెయిరీ ట్రస్ట్‌కు సంబంధించిన నిధులను గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీకి మళ్లించినట్టు ఆరోపణలు వచ్చాయి?

డెయిరీ ఎండీ: తెలియదు, మళ్లించలేదు...

ప్ర: డెయిరీ ఎండీగా మీ నెల జీతమెంత ?

జ: అన్ని కటింగ్స్ పోను రూ.7 లక్షల పైచిలుకు.

ప్ర: మీరు రూ.10 లక్షలు పైబడి తీసుకుంటున్నట్టు సమాచారం. డెయిరీని సహకార చట్టం నుంచి కంపెనీ చట్టంగా ఎందుకు మార్చాల్సి వచ్చింది?

జ: పాల కంపెనీల పోటీని తట్టుకొని మరింత బలపడేందుకు...

ప్ర: విశాఖ డెయిరీ ఆస్పత్రిని ఎందుకు ప్రైవేటుపరం చేశారు?

జ: ... (మౌనం)

ప్ర: పాల సేకరణ ధరను ఎందుకు తగ్గించారు?

జ: బోనస్ రూపేణా రైతులకు డబ్బులు చెల్లిస్తున్నాం.

ప్ర: విద్యార్హతతో సంబంధం లేకుండా ఉద్యోగాలు, ప్రమోషన్లు ఎలా ఇస్తున్నారు?

జ: నిబంధనల ప్రకారమే అన్నీ జరుగుతున్నాయి.

ప్ర: కాంట్రాక్టు కార్మికులకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు?

జ: కార్మికులకు అన్ని విధాలా న్యాయం చేస్తున్నాం

ప్ర: డెయిరీ కార్యకలాపాల్లో చైర్మన్ కుటుంబ సభ్యుల పాత్ర?

జ: చైర్మన్ కుటుంబ సభ్యుల జోక్యం ఉండదు

ప్ర: హైదరాబాద్‌లో పెట్టిన డెయిరీ యూనిట్ ఎవరి పేరు మీద ఉంది?

జ: ... (మౌనం)

చైర్మన్: కార్మిక చట్టం ప్రకారం జీతాలు ఎందుకు చెల్లించడం లేదు?

ఎండీ: చెల్లిస్తున్నాం.

విదేశాలకు రేషన్ బియ్యం...

విశాఖ పోర్టు నుంచి ఎగుమతి

- కాకినాడపై నిఘా నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా విశాఖను ఎంచుకున్న అక్రమార్కులు
- ఇక్కడ నుంచి రెండు నెలల్లో 70 వేల టన్నులు బియ్యం ఎగుమతి అయినట్టు గుర్తింపు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డుదారులకు ప్రతి నెలా ఉచితంగా పంపిణీ చేసే బియ్యం విశాఖ పోర్టు నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టింది. బియ్యం ఎగుమతికి కేంద్రంగా మారిన కాకినాడ పోర్టుపై ప్రత్యేకంగా దృష్టిపెట్టడంతో అక్రమార్కులు ప్రత్యామ్నాయంగా విశాఖ పోర్టును ఎంపిక చేసుకున్నారు.



పోర్టు ఏరియాలోని కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ గోదాముల్లో బియ్యం నిల్వలను తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

గడచిన రెండు నెలల్లో విశాఖ పోర్టు నుంచి 70 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేశారని స్వయంగా పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. వాటి విలువ రూ.25 వేల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. గడచిన మూడేళ్లలో విశాఖ పోర్టు నుంచి 36 వేల టన్నులు బియ్యం ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేసినట్టు తెలుస్తోంది.

రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జరిగే ప్రాంతాల్లో విశాఖ ఒకటి. నెలకు ఎనిమిదివేల టన్నుల బియ్యం పేదలకు అందజేస్తుండగా అందులో 80 శాతం బయటకు తరలిపోతుంది. అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వేల టన్నుల రేషన్ బియ్యం చిరు వ్యాపారులు కొనుగోలు చేసి మిల్లర్లకు అమ్ముతుంటారు. మిల్లర్లు ఆ బియ్యాన్ని పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసే వ్యాపారులకు అమ్ముతుంటారు. ఇటీవల వరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రేషన్ బియ్యం కాకినాడకు రవాణా అవుతుండేవి. ఇందుకు అనకాపల్లి జిల్లా చోడవరం ప్రాంతంలో మిల్లర్ ఒకరు ప్రముఖ పాత్ర పోషించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ మిల్లర్ కాకినాడకు చెందిన వైసీపీ నేత ద్వారంపూడి కుటుంబీలకు నమ్మిన బంటు. సదరు వ్యాపారిపై అనేక ఆరోపణలున్నా ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పటి నుంచి అధికారులు ఎవరూ ఆయన వైపు కన్నెత్తి చూసేవారు కాదు. గత ప్రభుత్వంలో అందరికీ దండిగా మూమ్ముళ్లు ఇస్తూ ద్వారంపూడి కుటుంబీకుల అండదండలతో చోడవరం వ్యాపారి ఉత్తరాంధ్ర డాన్‌గా ఎదిగారని చెబుతారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కాకినాడ పోర్టుపై నిఘా పెరగడంతో అక్రమ వ్యాపారులు ప్రత్యామ్నాయంగా విశాఖపట్నం పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతి చేయడం మొదలెట్టారు. ఇక్కడ నుంచి ఆఫ్రికాకు ఎగుమతి చేస్తున్నారు. విశాఖ పోర్టు నుంచి మేలు రకం బియ్యం విదేశాలకు ఎగుమతి అవుతోంది. దీని ముసుగులో రేషన్ బియ్యం ఎగుమతి చేస్తే కస్టమ్స్ అధికారులకు అనుమానం రాదని అక్రమార్కులు అంచనాకు వచ్చారు. రెండు నెలల వ్యవధిలో ఏకంగా 70 వేల టన్నులు ఎగుమతి అయ్యాయంటే తప్పకుండా ... మిగతా 6వ పేజీలో

పోర్టులో 483 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు

... మెయిన్‌లో

సత్తా చాటిన నితీష్

- రెండు టెస్టులలో భారత్ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచిన నగర క్రికెటర్
- నాలుగు ఇన్నింగ్స్‌లలో 54 సగటుతో 163 పరుగులు
- సిక్సర్లలో వీరేంద్ర సెహ్వాగ్ రికార్డు బద్దలు



విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన యువ క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి పేరు మారుమోగిపోతోంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న సిరీస్‌లో టెస్ట్ క్రికెట్‌లో అరగేట్రం చేసిన నితీష్‌కుమార్...చక్కగా రాణిస్తూ మంచి స్కోర్లు చేస్తున్నాడు. ప్రత్యర్థి బౌలర్లు విసిరే నిప్పులు చెరిగే బంతులను అలవోకగా బౌండరీలు దాటిస్తున్నాడు. అంతేకాకుండా ఆస్ట్రేలియాలో ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధికంగా ఆరు సిక్సర్లు కొట్టిన వీరేంద్ర సెహ్వాగ్ రికార్డును నితీష్‌కుమార్‌రెడ్డి (ఏడు సిక్సర్లు) బద్ధలు కొట్టాడు.

ఐపీఎల్‌లో చూపిన ప్రతిభతో సెలక్టర్లను ఆకర్షించిన నితీష్‌కుమార్‌రెడ్డి...స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన ... మిగతా 6వ పేజీలో

తగ్గిన కూరగాయల ధరలు



- రూ.60 నుంచి రూ.34కు దిగివచ్చిన టమాటా
- కాలీఫ్లవర్ రూ.18
- బెండ రూ.20, వంకాయ రూ.28, క్యాబేజీ రూ.20

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో కూరగాయల ధరలు భారీగా తగ్గాయి. ఇటీవల అన్నిరకాలు కిలో రూ.40 నుంచి రూ.60 మధ్య అమ్ముడయ్యాయి. ఇప్పుడు స్థానిక ఉత్పత్తులు మార్కెట్లకు రావడంతో ధరలు తగ్గాయి. ముఖ్యంగా టమాటా ధర కిలో రూ.34కి దిగివచ్చింది. ఇటీవల దీని ధర రూ.60 వరకు వెళ్లింది. రెండు రోజుల క్రితం వరకు టమాటా కిలో రూ.46కి విక్రయించారు. చిత్తూరు జిల్లా మదనపల్లె మార్కెట్‌పై ఆధారపడడంతో ఇన్నాళ్లూ రేటు అధికంగా ఉండేది. ఇప్పుడు స్థానిక పంట రావడంతో పాటు కోల్‌కతా నుంచి దిగుమతి కావడంతో రేటు తగ్గింది. నెలాఖరుకు ఇంకా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఇక ఈ సీజన్‌లో మాత్రమే వచ్చే కాలీఫ్లవర్ రేటు కిలో రూ.50 నుంచి రూ.18కి పడిపోయింది. దీనిని ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాల్లోనే పండిస్తారు. ఈసారి కోటపాడు, దేవరాపల్లి, రామభద్రపురాల నుంచి కూడా భారీగా మార్కెట్‌కు రావడంతో ధర తగ్గింది. రూ.20 పెడితే పెద్ద పువ్వు లభిస్తోంది. బెండకాయలు కిలో రూ.30 నుంచి రూ.20కి వచ్చేశాయి. వంకాయ (తెలుపు) కిలో రూ.40 నుంచి రూ.28కి, బీన్స్ కిలో రూ.80 నుంచి రూ.52కు, బీన్స్ పిక్కలు(తెలుపు) కిలో రూ.120 నుంచి రూ.84కి తగ్గాయి. క్యాబేజీ కిలో రూ.32 నుంచి రూ.20కి వచ్చేసింది. పచ్చిమిర్చి కిలో రూ.22కే దొరుకుతోంది. క్యారెట్ మాత్రం రూ.50 నుంచి రూ.70కి పెరిగింది. అలాగే ఉల్లి ధర తగ్గడం లేదు. కిలో రూ.50 దగ్గరే స్థిరపడిపోయింది.

గంజాయిపై ప్రత్యేక నిఘా

రవాణా, విక్రయాలు, వినియోగానికి పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు నగర పోలీసుల యత్నం

- ఏజెన్సీ నుంచి నగరానికి వచ్చే మార్గంలో చెక్‌పోస్టులు పెంపు
- శివారు ప్రాంతాల్లో సోదాలు
- భారీగా పట్టుబడుతున్న గంజాయి



సీపీ శంఖబ్రత బాగ్చీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) నగరంలో గంజాయి రవాణా, విక్రయాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడంపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ దృష్టిసారించారు. ఏజెన్సీ నుంచి గంజాయిని ఇతర ప్రాంతాలకు రవాణా చేయడానికి స్మగ్లర్లు నగరాన్ని ట్రాన్సిట్ హాల్ట్‌గా మార్చుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించి గంజాయి నగరంలోకి రాకుండా శివారు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి తనిఖీలను ముమ్మరం చేశారు. దీంతో గత నెల రోజులుగా పెద్దఎత్తున గంజాయి పట్టుబడుతోంది.

గంజాయి నియంత్రణను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అదే అదనుగా తీసుకుని స్మగ్లర్లు, వ్యాపారులు ఏజెన్సీ నుంచి గంజాయిని వివిధ మార్గాల్లో నగరానికి తీసుకువచ్చి, పెందుర్తి, దువ్వాడ వంటి శివారు ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని నిల్వ చేయడం మొదలెట్టారు. వీలు చూసుకుని ఇక్కడి నుంచి రైలు, కొరియర్, బస్సులు, ప్రైవేటు వాహనాల ద్వారా నగరం దాటించేస్తున్నారు. ఈ క్రమంలోనే నగరంలో కూడా విక్రయించడం మొదలుపెట్టారు. ఎక్కడికక్కడ గంజాయి లభ్యమవుతుండడంతో యువత, నిరుపేద కుటుంబాలకు చెందినవారు గంజాయి వాడకానికి అలవాటుపడ్డారు. ఆ ప్రభావం నగరంలో క్రైమ్ రేటుపై పడుతోంది. గంజాయి మత్తులో ఎదుటి వారిపై దాడిచేయడం, డబ్బులు కోసం దోపిడీలు, చోరీలకు పాల్పడడం, మహిళలను వేధించడం, అఘాయిత్యాలకు పాల్పడడం చేస్తున్నారు.

అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత గంజాయిని కట్టడి చేసేందుకు వంద రోజుల ప్రణాళికను అమలు చేయడం ప్రారంభించింది. అందులో భాగంగా ఏజెన్సీ నుంచి నగరానికి గంజాయి దిగుమతి అవుతున్న మార్గాలను ... మిగతా 6వ పేజీలో

మాస్టర్ ప్లాన్

రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన వారికి నగదు పరిహారం ఇవ్వాలట

జీవీఎంసీ అధికారులు విచిత్ర ప్రతిపాదన

- కౌన్సిల్ ఎజెండాలో చేర్చిన వైనం
- ఇప్పటివరకూ పరిహారంగా టీడీఆర్ బాండ్‌లు మాత్రమే జారీ
- నగదు పరిహారం ఇవ్వాలనే ప్రతిపాదనపై సర్వత్రా అనుమానాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు ఎక్కడా లేని సంప్రదాయానికి తెరతీస్తున్నారు. ఇప్పటివరకూ రోడ్డు విస్తరణలో ఎవరైనా నగరవాసులు భూమిని కోల్పోతే వారికి పరిహారంగా టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్) బాండ్‌లు జారీచేస్తున్నారు. కానీ అందుకు భిన్నంగా ఇప్పుడు నగదు పరిహారం ఇవ్వాలని అధికారులు నిర్ణయించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అదే జరిగితే పెద్దఎత్తున అవినీతికి అవకాశం లభించడంతోపాటు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

నగరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వీఎంఆర్‌డీఏ ప్రతి 20 ఏళ్లకు మాస్టర్‌ప్లాన్ తయారుచేస్తుంది. అందులో కొత్తగా రహదారుల ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలు, విస్తరించాల్సిన రోడ్లను గుర్తించి బ్లూప్రింటును జీవీఎంసీ అధికారులకు అందజేస్తుంది. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన రోడ్లకు రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) తయారుచేసి, ఎక్కడెక్కడ ఎంతెంత భూమిని సేకరించాల్సి ఉంటుంది, అందులో ప్రభుత్వ భూమి ఎంత, ప్రైవేటు భూమి ఎంత అనేది సర్వే చేస్తారు. రోడ్డు నిర్మాణం/విస్తరణ కు అవసరమయ్యే భూమిని జీవీఎంసీకి అప్పగించాలని, దీనికి పరిహారంగా భూమి విలువకు నాలుగు రెట్లు విలువ చేసే టీడీఆర్‌బాండ్‌లను ఇస్తామంటూ భూమి యజమానులకు నోటీస్ ఇస్తారు. భూమి యజమానులు భూమిని అప్పగించేసి, పరిహారంగా టీడీఆర్ బాండ్‌లను తీసుకుంటారు. ఆ బాండ్‌లను వారే తమ ఇళ్లు, భవనాలు నిర్మాణాలకు జీవీఎంసీకి చెల్లించాల్సిన ఫీజులు కింద ... మిగతా 6వ పేజీలో

కౌన్సిల్ సమావేశంలో పాలకపక్షం అవినీతిని ఎండగడదాం

- ఎజెండాలో ప్రజలకు నష్టం కలిగించే అంశాలు
- వాటిని వ్యతిరేకిద్దాం
- షాడో సమావేశంలో కూటమి కార్పొరేటర్లు తీర్మానం

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం కోసం రూపొందించిన ఎజెండాలో ప్రజలకు నష్టం కలిగే అనేక అంశాలను చేర్చారని, దీనిపై సమావేశంలో పాలక పక్షాన్ని ఎండగట్టాలని కూటమి కార్పొరేటర్లు తీర్మానం చేశారు. కౌన్సిల్ సమావేశం సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన కూటమి కార్పొరేటర్లు సోమవారం షాడో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజెండాలోని అంశాలపై కూలంకుషంగా చర్చించారు. ముడసర్లోవ పార్కులో హార్స్ రైడింగ్ ప్రాజెక్టు నిర్మాణానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి ముందస్తు ఆమోదం తెలపడంపై మేయర్‌ను నిలదీయాలని నిర్ణయించారు. అలాగే



షాడో సమావేశంలో పాల్గొన్న కూటమి కార్పొరేటర్లు

క్లాప్ వాహనాలకు లోడర్లను 65 రోజులు మాత్రమే పనిచేయించుకునేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపితే ఏకంగా ఏడాదిపాటు అనధికారికంగా కొనసాగించడంతోపాటు వారికి వేతనాలు చెల్లించాలని ఎజెండాలో చేర్చడాన్ని పూర్తిగా వ్యతిరేకించాలని నిర్ణయించారు. జీవీఎంసీ పరిధి జోన్-2లో రోడ్ల విస్తరణకు సేకరించిన భూమికి టీడీఆర్‌లకు బదులుగా నగదు చెల్లించాలని ప్రతిపాదించడంపై అభ్యంతరం తెలపాలని నిర్ణయించారు. అలాగే తాటిచెట్లపాలెంలో ఇళ్ల నిర్మాణం కోసం ... మిగతా 6వ పేజీలో

క్వారీ లారీల యజమానుల నూతన కార్యవర్గం

భీమునిపట్నం (రూరల్), డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, తగరపువలస, మధురవాడ ప్రాంతాల్లో ఉన్న క్వారీ లారీల యజమానుల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం మహారాజుపేట వద్ద ఉన్న కోదండరామ స్వామి ఆలయంలో జరిగింది. అధ్యక్షుడిగా భీమిలి మండలం సింగనబంద గ్రామానికి చెందిన మద్దిల రమణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సభ్యులు రౌతు రామకృష్ణ, మద్దిల అప్పలరాజు, వెంకయ్య పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ కంపెనీ రూ. 1.25 లక్షలతో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసింది. దీన్ని ఆ కంపెనీ సీఎస్ఆర్ మేనేజరు సురేశ్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కమల, దివీస్ ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌ను ప్రారంభించాలి : సీపీఐ

తగరపువలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలో ఏర్పాటు చేసిన రైతుబజారును తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని సీపీఐ నాయకులు మార్కెటింగ్ శాఖాధికారులను కోరారు. సోమవారం వారు ఆ శాఖాధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబజారును ప్రారంభించకపోవడంతో సంత, రోడ్డు పక్కన వ్యాపారులు నిత్యావసర సరకులు, కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం సంత ఉన్న ప్రాంతంలో రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కూడా కలుగుతున్నాయని తెలిపారు. ఈ విషయమై తక్షణమే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్లు అందజేత

ఆనందపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులకు గిడిజాల సమీపంలో ఉన్న మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఘట్టమనేని సుభాశ్ చంద్రబోస్ (బోసుబాబు) రెండు సైకిళ్లు వితరణగా అందజేశారు. చీమల వెంకటాపురం గ్రామానికి చెందిన జాన వరలక్ష్మి,కుసులువాడకు చెందిన పిళ్లా వర్ష చాలా దూరం నుంచి పాఠశాలకు నడిచి వస్తున్న విషయాన్ని స్థానిక నాయకులు బోసుబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బంటు అప్పారావు, గిడిజాల మాజీ సర్పంచ్ కోరాడ రాము, కూటమి నాయకులు ఎర్ర బంగారునాయుడు, కోరాడ వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

అడివివరం భూముల రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలి

సింహాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామ కంఠం భూముల రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవదాయ శాఖకు చెందిన కొందరు అధికారుల నిర్ణయం వల్ల పంచ గ్రామాల్లో ఒకటైన అడివివరం గ్రామ కంఠానికి చెందిన భూములను 22ఏ (1సి) జాబితాలో చేర్చారని చెప్పారు. దీనివల్ల ఈ ప్రాంతంలోని భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని చెప్పారు. స్థానికులు పిల్లల వివాహాలు, చదువులు, ఆరోగ్య అవసరాలకు తమ ఆస్తులను క్రయ విక్రయాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని, బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, అడివివరం సొసైటీ పాలక మండలి సభ్యుడు కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 15 వినతుల స్వీకరణ



జడ్సీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొమ్మాది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 15 వినతులు అందాయని జడ్సీ ఫణిరామ్ తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళికా విభాగానికి 8,ఈఈ వర్క్స్7, విద్యుత్ విభాగానికి 1,యూసీడీ విభాగానికి 1, తాగునీటి సరఫరా విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయని చెప్పారు. కాగా బక్కన్నపాలెం, నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రహదారుల విస్తరణకు టీడీఆర్‌లు మంజూరు చేసి, స్థలాలను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ నాయకులు లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, ఆనందబాబు జడ్సీని కోరారు.

భీమిలిలో ఏడు అర్జీలు

భీమునిపట్నం : జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఏడు అర్జీలు అందినట్టు జడ్సీ ప్రసన్నవాణి తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళికా విభాగానికి 1, ఇంజనీరింగ్ విభాగానికి 3, రెవెన్యూ విభాగానికి 1, ప్రజారోగ్య విభాగానికి 2 అర్జీలు అందాయన్నారు. వాటిని ఆయా విభాగాలకు పంపించామని, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.



కాలనీలో కొన్నిచోట్ల పేరుకుపోయిన తుప్పలు





పలు ప్రాంతాల్లో అంతర్గత రహదారుల దుస్థితి

సమస్యల్లో సాయిప్రియా లేఅవుట్

» కనీస సదుపాయాలు లేక స్థానికుల అవస్థలు
» అధ్వానంగా రోడ్లు ..కానరాని వీధి లైట్లు

కొమ్మాది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డు సాయిప్రియా గార్డెన్ లేఅవుట్ నివాసితులు సమస్యలతో సతమతమవుతున్నారు. కనీస సదుపాయాలు లేక నరకయాతన అనుభవిస్తున్నారు.ముఖ్యంగా అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాలనీలోని పార్కు ఏళ్ల తరబడి నిర్వహణకు నోచుకోవడం లేదు. దీంతో పార్కులో తుప్పలు పేరుకుపోయాయి. పిల్లలు ఆడుకునే బల్లలు, కుర్చీలు తుప్పు పట్టి పాడయ్యాయి. వాకింగ్ ట్రాక్ శిథిలమైంది. వృద్ధులు, మహిళలు కూర్చునేందుకు బెంచీలు లేవు. కాలనీలో వీధి లైట్లు కూడా లేవు. పలు ప్రాంతాలు చీకటిలోనే మగ్గుతున్నాయి. ఈ లేఅవుట్‌ను ఆనుకుని బక్కన్నపాలెం వెళ్లే మాస్టర్ ప్లాన్ రహదారి 2014లో విస్తరించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్థలాలు కోల్పోయిన వారిలో కొందరు కోర్టును ఆశ్రయించడంతో అప్పటి నుంచి అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు పూర్తయితే సాయిప్రియాగార్డెన్ వాసులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డుపై గోతులు పూడ్చాలని ఎమ్మెల్యే గంటా ఆదేశించడంతో అక్కడక్కడ గోతులు పూడ్చుతున్నప్పటికీ అంతర్గత రహదారులు మాత్రం ఇంకా అధ్వానంగానే ఉన్నాయి. పాలకులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తహసీల్దార్ రామారావు

తగరపువలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ పి. రామారావు అన్నారు. సోమవారం చిట్టివలసలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రభుత్వ భూముల ఆక్రమణపై వినతిపత్రాలు అందించారు. ఈ ప్రాంతంలో ఆర్టీసీ కాంప్లెక్సు, జూనియర్ కళాశాల, ఆసుపత్రి, కల్యాణ మండపం, స్పోర్ట్సు క్లబ్, అంగన్‌వాడీ కేంద్రాలు, ఔట్‌పోస్టు పోలీసు స్టేషన్, గ్రామ సచివాలయానికి ప్రభుత్వ భూమి అవసరం ఉందని, కాని చాలా భూములు ఆక్రమణల్లో ఉన్నాయని టీడీపీ నాయకుడు పిట్ట సురేశ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. చిట్టివలస చెరువు విస్తీర్ణాన్ని సమగ్రంగా సర్వే చేయించి, హద్దులు నిర్ణయించాలన్నారు. అలాగే జూట్‌మిల్లు ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. 2వ వార్డు కార్పొరేటర్ జి. చిన్నికుమారి లక్ష్మి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డుల దరఖాస్తులు, భూ దరఖాస్తులను పరిశీలించాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు బడిగంటి నీలకంఠం, పిట్ట వెంకటరావు, చెట్ల రమణ, టీడీపీ నాయకులు అప్పలనాయుడు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో సమస్యలను విన్నవిస్తున్న రమేశ్

కొమ్మాది : కొమ్మాది, రేవళ్లపాలెం, బక్కన్నపాలెం గ్రామాల రైతులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు భూములను తీసుకున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆరోపించింది. సోమవారం కొమ్మాదిలో జరిగిన రెవెన్యూ సదస్సులో వారు రైతుల సమస్యలపై డీటీకి వినతిపత్రం అందించారు. కొమ్మాది దేవిమెట్టకు వెళ్లే దారిలో 25 ఏళ్లుగా పాకలు వేసుకుని ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సియాద్రి పైడితల్లి, మధురవాడ జోన్ కమిటీ ఉపాధ్యక్షుడు డి. అప్పలరాజు, దళిత సంఘాల నాయకులు సియాద్రి కనకరాజు, పాల్గొన్నారు. సదస్సు లో 35 వినతులు అందినట్టు ఆర్ఐ కిశోర్ తెలిపారు.

నేడు వాంబేకాలనీలో...

మధురవాడ :వాంబేకాలనీలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. కాలనీలోని కల్యాణ మండపం వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సదస్సు జరుగుతుందన్నారు. స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మధురవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. మధురవాడ సాయిప్రియా లేఅవుట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా టెన్నిస్ టోర్నమెంటు నిర్వహించారు. సోమవారం ఆయన విజేతలకు ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. క్రీడాకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రుషికొండ బీచ్‌లో స్విమ్మింగ్ శిక్షణ



శిక్షణ పొందుతున్న యువకులు

సాగర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాటర్ స్పోర్ట్స్ (ఎన్ఐడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈతలో శిక్షణ ప్రారంభమైంది. ఈతలో మెలకువలు, కెరటాల్లో చిక్కుకున్న వారిని సకాలంలో ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడే విధానం, ప్రథమ చికిత్స తదితర అంశాలపై నిర్వాహకులు పది రోజుల పాటు యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇస్తారు. వాటిని రెండేళ్లకు ఒకసారి తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలి. శిక్షణ పొందిన వారికి పర్యాటక శాఖ బోటు షికార్‌లోనూ, లైఫ్ గార్డులుగానూ ఉపాధి కల్పించనుంది. ప్రస్తుతం 27 మంది శిక్షణ పొందుతున్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్, వైద్య శాఖ అధికారులు

ఆనందపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పిడి జి. జయదేవి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీ 'కిశోరి వికాసంపై' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం ఉందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కిశోర బాలికల విద్య, న్యూట్రీషియన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎం. శ్రీదేవి, ఎంపీడీవో డాక్టర్ జానకి, ఎంఈవో గంగరాజు, స్థానిక వైద్యాధికారి గంగునాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వి. రత్నం, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనంతా అరాచకమే : గంటా నూకరాజు

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలన మొత్తం అరాచకమే సాగిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు. సోమవారం ఆయన బీచ్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ చేసిన అరాచకాలు ఒక్కొక్కటి బయట పడుతున్నాయని చెప్పారు. ఎవరికి ఏది దొరికితే అది దోచుకోవడానికే ఆ పార్టీ నాయకులకు అయిదేళ్లు పూర్తయ్యిందన్నారు. కాకినాడ పోర్టు కేంద్రంగా జరిపిన రేషన్ బియ్యం అక్రమ రవాణా నుంచి దేవదాయ శాఖకు చెందిన భూములు, ప్రైవేట్ భూములతో సహా పారిశ్రామికవేత్తలను భయపెట్టి రాయించుకున్న వాటాల వరకూ అంతా దుర్మార్గమేనని దుయ్యబట్టారు.అటువంటి నాయకులు కూటమి పాలన గురించి మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందని ఎద్దేవా చేశారు.

పాలకపక్షం అవినీతిని ఎండగడదాం

... 5వ పేజీ తరువాయి

ప్రైవేటు వ్యక్తుల నుంచి గృహ నిర్మాణ సంస్థ తీసుకున్న భూమికి ప్రత్యామ్నాయంగా ముడసర్లోవ ప్రాంతంలో అత్యంత విలువైన భూమిని కేటాయించాలనే ప్రతిపాదనను అడ్డుకోవాలని నిర్ణయించారు. ఇంకా రూ.21 కోట్ల వ్యయంతో చేపడుతున్న స్వర్ణభారతి స్టేడియం అభివృద్ధి పనుల్లో అనేక లొసుగులు ఉన్నాయని, ఆయా పనులపై లోతుగా చర్చ జరపడంతోపాటు పూర్తి వివరాలను అధికారుల నుంచి రాబట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, బీజేపీ ఫ్లోర్‌లీడర్ గంకల కవిత, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావుతోపాటు 40 మందికి పైగా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనులు నిలుపుదల చేయాలని ఫిర్యాదు

ఆనందపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పరదేశిపాలెం నుంచి గంభీరం వరకు వీఎంఆర్‌డీఏ నిర్మించనున్న రోడ్డు పనులను నిలుపుదల చేయాలని సర్పంచ్ వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, ఉప సర్పంచ్ బొట్టా శ్రీను ఆధ్వర్యంలో గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం వారు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరదేశిపాలెం నుంచి బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా గంభీరం వరకు వీఎంఆర్‌డీఏ రూ. 15 కోట్లతో 60 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి రాళ్లు పాతినట్టు చెప్పారు. పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతి తీసుకోకుండా, రైతులకు సమాచారం గాని, నష్టపరిహారం గాని చెల్లించకుండా ఇష్టానుసారంగా రాళ్లు పాతారన్నారు. అలాగే రోడ్డు కంబాలకొండ రిజర్వు ఫారెస్టుకు ఆనుకుని వేస్తుండడం వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా వణ్యప్రాణులకు కూడా ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. గ్రామసభ నిర్వహించి, ప్రజాభిప్రాయ సేకరణతో పంచాయతీ తీర్మానం ద్వారా రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

'సభ్యత్వ నమోదులో భీమిలి ప్రత్యేకత చూపాలి'

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వ నమోదులో భీమిలి ప్రత్యేకను చూపించాలని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ తెలిపారు. సోమవారం రాత్రి ఆయన జీఎస్ఆర్ భవన్‌లో నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేపట్టాలని ఎమ్మెల్యే శ్రీనివాసరావు పిలుపుమేరకు కార్యకర్తలు ఇప్పటివరకు 53,173 సభ్యత్వాలను పూర్తి చేశారని చెప్పారు. ఈనెల 20వ తేదీలోగా మిగిలిన సభ్యత్వాలను కూడా పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఉత్సాహవంతంగా సభ్యత్వ నమోదు చేసిన వారికి మెమెంటోలు అందజేశారు. అలాగే యాభై వేలు మైలురాయి దాటడంతో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, భీమిలి మండల పార్టీ అధ్యక్షుడు దంతులూరి అప్పల నరసింహరాజు, కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, కశిరెడ్డి దామోదరరావు, మొల్లి లక్ష్మణరావు, యార్లగడ్డ జీవన్‌కుమార్, గాడు వెంకటప్పడు, వాండ్రాసి అప్పలరాజు, చెట్టుపల్లి గోపి, నాగోతి శివాజీ, తమ్మిన సూరిబాబు, పాసి త్రినాథ్‌కుమార్, ఆనందపురం అప్పారావు పాల్గొన్నారు.

డెయిరీపై లోతుగా విచారణ

... 5వ పేజీ తరువాయి

కమిటీని నియమించిందన్నారు. ఇకపై విశాఖ డెయిరీని ప్రణాళికా బద్ధంగా నడిపే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

రైతులు, కార్మికులకు అన్యాయం చేస్తే ఉపేక్షించం

విశాఖ డెయిరీ రైతులకు, కార్మికులకు న్యాయం చేయడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ స్పష్టంచేశారు. డెయిరీలో విచారణ అనంతరం గేటు బయట దీక్ష చేస్తున్న కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ పురోభివృద్ధి చెందాలంటే పాడి రైతులు, కార్మికుల సేవలు అవసరమని, వారి విషయంలో ఎటువంటి అన్యాయం జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. కార్మికుల ఆందోళన, ఆవేదన చూస్తే యాజమాన్యం పెద్దగా స్పందించడం లేదన్న విషయం తెలుస్తుందన్నారు.

విచారణకు చైర్మన్ డుమ్మా

శాసనసభా కమిటీ సోమవారం డెయిరీలో విచారణకు వస్తున్న విషయం తెలిసినప్పటికీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ హాజరుకాలేదు. డెయిరీ ఎండీ ఎస్వీ రమణ, తొమ్మిది మంది డైరెక్టర్లు (మొత్తం 14 మంది డైరెక్టర్లు ఉన్నారు) మాత్రమే ఉన్నారు. డెయిరీపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఎండీ ఎస్వీ రమణ మాత్రమే సమాధానాలు ఇచ్చారు.

సత్తా చాటిన నితీష్

... 5వ పేజీ తరువాయి

టీ20 సిరీస్‌లో భారత జట్టులో స్థానం పొంది ఆల్‌రౌండర్‌గా రాణించాడు. దీంతో ఆస్ట్రేలియా సిరీస్‌కు ఎంపికైన నితీష్‌కుమార్ తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 38 (నాటౌట్) పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర వహించాడు. రెండో టెస్ట్‌లో కూడా తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లీ, రోహిత్‌శర్మ, కేఎల్ రాహుల్, పంత్, గిల్, జైశ్వాల్ వంటి టాప్ ఆర్డర్ ఒకరి తర్వాత పెవెలియన్‌కు బాటపడితే..ఏడో నంబరు బ్యాట్స్‌మన్‌గా క్రీజులోకి వచ్చిన నితీష్‌కుమార్ మరోసారి జట్టును ఆదుకునే బాధ్యత తీసుకున్నాడు. సహ బ్యాట్స్‌మెన్‌గా వచ్చినవారు వచ్చినట్టుగానే వెనుతిరుగుతున్నా... నితీష్ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో కేవలం 56 బంతుల్లో మూడు బౌండరీలు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేసి చివరి వికెట్‌గా అవుటయ్యాడు. రెండో ఇన్నింగ్స్‌లో కూడా టాప్ ఆర్డర్ విఫలమైనా...మరోసారి ఏడో నంబరు స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన నితీష్‌కుమార్‌రెడ్డి పోరాట స్ఫూర్తిని ప్రదర్శించి కేవలం 47 బంతుల్లో ఆరు బౌండరీలు, ఒక సిక్సర్‌తో 42 పరుగులు చేసి సత్తా నిరూపించుకున్నాడు. రెండో టెస్టులో పది వికెట్ల తేడాతో భారత్ ఘోర పరాజయం పాలైన..నితీష్‌కుమార్ రెడ్డి ఆటతీరును ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ క్రికెటర్లు, అభిమానులు మెచ్చుకున్నారు. నాలుగు ఇన్నింగ్స్‌లలో 163 పరుగులు (సగటు 54కు పైగా) చేసిన నితీష్‌కుమార్‌రెడ్డి భారత్ జట్టులో అత్యధిక పరుగులు బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు.



సీఆర్పీఎఫ్ అధికారులతో ఆదివాసీ యువత

పలు ప్రాంతాలను సందర్శించిన ఆదివాసీ యువత

ఎండాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గీతం ఆసుపత్రి ఆడిటోరియం వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ గిరిజన సమ్మేళనంలో పాల్గొన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ యువత సోమవారం నగరంలోని పలు విభాగాలను సందర్శించారు. తొలుత వారు సీఆర్‌పీఎఫ్ 198వ బెటాలియన్‌ను సందర్శించి, సిబ్బందితో సమావేశమయ్యారు. అలానే హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు వెళ్లారు. వివిధ వృత్తి విద్యలో కేంద్రం ఇస్తున్న శిక్షణ గురించి అధికారులు వారికి వివరించారు. అనంతరం అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. అలాగే సాగర్ తీరంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే (నెహ్రూ యువ కేంద్రం సంఘటనన్) ఉమ్మడి విశాఖ జిల్లా యువ అధికారి గొర్లె మహేశ్వరరావు, శ్రీకాకుళం ఎన్‌వైకే అధికారి కె. వెంకట్ ఉజ్వల్, ఏవో పృథ్వీ, అల్లం రాంప్రసాద్, ప్రసన్న, శ్వేత, ఆర్. లీలాప్రసాద్, జేమ్స్ జ్ఞానదీప్, వినయ్ పాల్గొన్నారు.

జూట్‌మిల్లు భూముల అమ్మకాలు నిలిపివేయాలి

కార్మిక శాఖాధికారులకు పలు సంఘాల వినతి



విశాఖలో కార్మిక శాఖాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తగరపువలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం ఆధీనంలో ఉన్న భూముల విక్రయాలను నిలిపివేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. సోమవారం వారు నగరంలో కార్మిక శాఖాధికారి రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా మిల్లు యాజమాన్యం తన భూములను అమ్ముకోవాలని చూస్తుందని, ఈ విష యమై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు త్వరలోనే యాజమాన్యానికి కార్మిక సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారని అప్పటివరకూ భూముల విక్రయాలు జరగకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరమణ, ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, చిల్ల అప్పలసూరి, టీఎన్‌టీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు సాడి అచ్చారావు, ఎన్. రామారావు, కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జేవీ కైలాస్‌రెడ్డి, ఎం. ఆదినారాయణ, దల్లి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

గంజాయిపై ప్రత్యేక నిఘా

... 5వ పేజీ తరువాయి

గుర్తించి చెక్‌పోస్టుల సంఖ్యను పెంచారు. అదేవిధంగా దువ్వాడ, పెందుర్తి వంటి నగర శివారు ప్రాంతాలతో పాటు రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, పరిసర ప్రాంతాలైన అల్లిపురం, జ్ఞానాపురం, రైల్వేన్యూకాలనీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయా ప్రాంతాల పోలీసులను నగర పోలీస్ కమిషనర్ ఆదేశించారు.

గత నెలలో భారీగా పట్టుబడిన గంజాయి

గంజాయిపై గట్టిగా దృష్టిపెట్టడంతో గత నెలలో రవాణా, నిల్వ అభియోగాలపై 27 కేసులు నమోదుచేశారు. ఆయా కేసుల్లో ఏపీతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 53 మందిని అరెస్టు చేసి 452 కిలోల గంజాయి, ఎనిమిది కిలోల యాష్ ఆయిల్ (లిక్విడ్ గంజాయి), అర గ్రాము ఎండీఎంఏ మత్తుపౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గత నెల 30న దువ్వాడలోని ఒక ఇంట్లో నిల్వ చేసిన 120 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసులో తమిళనాడుకు చెందిన నలుగురితో పాటు కొరియర్‌గా వ్యవహరించిన అల్లూరి సీతారామరాజు జిల్లా వాసిని అరెస్టు చేశారు. అలాగే 20 కిలోలు గంజాయిని తమిళనాడు తీసుకువెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్న ఆ రాష్ట్రానికి చెందిన ముగ్గురిని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పట్టుకున్నారు. దువ్వాడ మంగళపాలెం వద్ద బైక్‌పై 40 కిలోల గంజాయి తీసుకువెళుతున్న ముగ్గురిని దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు.

గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు

- శంఖబ్రత బాగ్చీ, పోలీస్ కమిషనర్

గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గంజాయి నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. ఎక్కడికక్కడ తనిఖీలు చేయడం వల్ల గంజాయి పట్టుబడుతోంది. కొంతమంది వ్యాపారులు అద్దెకు ఇళ్లను తీసుకుని గంజాయి నిల్వ చేస్తున్నారే, యజమానులు గుర్తించడం లేదు. అద్దె ఎక్కువ వస్తుందనే ఆశతో గంజాయి స్మగ్లర్లకు ఇళ్లు ఇస్తున్న వారిపై కూడా చర్యలు తప్పవు. గంజాయి రవాణా, నిల్వ, విక్రయం సమాచారం ఎవరికైనా లభిస్తే 7995095799 నంబర్‌కు ఇవ్వొచ్చు.

మాస్టర్ ప్లాన్

... 5వ పేజీ తరువాయి

వినియోగించుకునే వీలుంటుంది. లేనిపక్షంలో ఆ బాండ్‌లను ఇతరులకు విక్రయించి, ఆన్‌లైన్‌లో బదలాయింపు చేసుకునే అవకాశం ఉంటుంది. జీవీఎంసీ పరిధిలో ఇప్పటివరకూ కొత్తగా నిర్మించిన రోడ్లతోపాటు విస్తరించిన రోడ్లకు స్థల సేకరణ జరిగిన సందర్భాల్లో ఇదే విధానం అమలైంది. ఇప్పటికీ అదే విధానం అమలులో ఉంది. అయితే ఎండాడ నుంచి గీతం కాలేజీ మీదుగా బీచ్‌రోడ్డు వరకూ వంద అడుగుల రహదారి విస్తరణకు ఆ ప్రాంతంలో కొంత భూమిని సేకరించాల్సి ఉందని, టీడీఆర్ తీసుకునేందుకు యజమానులు విముఖత వ్యక్తంచేస్తున్నారు కాబట్టి వారికి నగదు పరిహారం చెల్లించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రతిపాదన తయారుచేశారు. రోడ్డు విస్తరణ కోసం తీసుకుంటున్న భూమికి పరిహారంగా యజమానులకు ఏకంగా రూ.10.93 కోట్లు చెల్లించేందుకు అనుమతివ్వాలంటూ ఈనెల 11న జరిగే కౌన్సిల్ సమావేశం ఎజెండాలో పొందుపరచడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

అవినీతికి తలుపులు తెరిచినట్టే...

టీడీఆర్ బాండ్‌లకు బదులుగా నగదు ఇవ్వడం ప్రారంభిస్తే అవినీతికి తలుపు తెరిచినట్టేనని కొంతమంది అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మునిసిపల్ చట్టంలో ఏదో మూలన నగదు పరిహారం చెల్లించేందుకు వెసులుబాటు ఉందంటూ...ఇంతవరకూ ఎప్పుడూ అమలుచేయని కొత్త సంప్రదాయానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు తెరతీయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. టీడీఆర్‌కు బదులుగా నగదు పరిహారం ఇస్తే భవిష్యత్తులో ఎవరూ బాండ్‌లు తీసుకోరని, అందరూ నగదు పరిహారమే కోరుతారని, అప్పుడు జీవీఎంసీకి వచ్చే ఆదాయం వారికి పంచిపెట్టడానికే సరిపోతుందని అభిప్రాయపడుతున్నారు. కొంతమంది అధికారులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఇలాంటి ప్రతిపాదనను తయారుచేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై కౌన్సిల్‌లో నిలదీయాలని ఇప్పటికే కూటమి కార్పొరేటర్లు తీర్మానం చేయడం విశేషం. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సంప్రదాయాన్ని అమలు చేయాలనే యోచనను స్వచ్ఛందంగానే విరమించుకోవాలని కోరుతున్నారు.

విదేశాలకు రేషన్ బియ్యం...

... 5వ పేజీ తరువాయి

రేషన్ బియ్యమే అయి ఉంటాయని పౌర సరఫరాల అధికారుల అనుమానిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాలంటే ఎక్కడ నుంచి పోర్టుకు బియ్యం వచ్చాయనేది ఎగుమతిదారుడిని విచారించాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు.

పక్కా సమాచారంతో పోర్టుపై దాడి

విశాఖ పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతి అవుతున్నాయని పక్కా సమాచారం జిల్లా యంత్రాంగానికి వచ్చింది. వెంటనే నాలుగు బృందాలను ఏర్పాటు చేసి సోమవారం ఉదయం పోర్టు పరిధిలో గోదాముల తనిఖీకి పంపారు. ఒక చోట రేషన్ బియ్యం ఉన్నాయనే సమాచారం రావడంతో నగరంలోనే ఉన్న పౌర సరఫరాల మంత్రి మనోహర్, జేసీ మయూర్ అశోక్‌తో కలిసి దాడులు చేశారు.

శ్రీహరిపురం ఆస్పత్రిలో మందుల కొరత!

- నిరాశతో వెనుదిరుగుతున్న రోగులు
- పట్టించుకోని నిర్వహణ సంస్థ యాజమాన్యం
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పటిష్ఠ చర్యలు చేపట్టాలని వేడుకోలు



శ్రీహరిపురంలోని జీవీఎంసీ ఆస్పత్రి ప్రవేశ ద్వారం

మల్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ శ్రీహరిపురం ఆస్పత్రిలో తీవ్ర మందుల కొరత నెలకొంది. గత నెల రోజులుగా మందులు అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రికి వస్తున్న రోగులు తీవ్ర నిరాశతో తిరిగి వెళుతున్నారు. ఇక్కడి ఆస్పత్రికి రోజూ ఓపీ రెండు వందలు దాటుతోంది. అయితే వచ్చిన రోగులకు ఒక్క మందుబిళ్ల అందించలేని దుస్థితి ఆస్పత్రిలో నెలకొనడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పారిశ్రామిక ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు శ్రీహరిపురంలో 1987లో ఆస్పత్రిని ప్రారంభించారు. కాలక్రమేణా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఏడు వార్డులకు చెందిన పేదలందరూ ఈ ఆస్పత్రికే వైద్య సేవలు నిమిత్తం వస్తుంటారు. కొంతకాలం క్రితం నుంచి ఈ ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేటు ఏజెన్సీకి జీవీఎంసీ అప్పగించడం ప్రారంభించింది. అప్పటి నుంచే ఆస్పత్రిని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ఈ క్రమంలో ఆస్పత్రి నిర్వహణను చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులకు జీవీఎంసీ నెలకు రూ.ఎనిమిది లక్షలు చెల్లిస్తోంది. ఈ సొమ్ముతోనే ఆస్పత్రిని సదరు సంస్థ నడపాలి. ప్రస్తుతం కనీసం మందుబిళ్లలను సైతం రోగులకు అందించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాలుగు నెలల క్రితమే ఈ సంస్థ టెండర్ కూడా ముగిసింది. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు కొత్తగా టెండర్లను ఆహ్వానించకుండా సదరు సంస్థకే గడువు పొడిగించారు. మరి ఆ సంస్థ నిర్వాహకులు ఆస్పత్రిలో మందులను ఎందుకు అందుబాటులో ఉంచడం లేదో ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు ఈ ఆస్పత్రిని సందర్శించారు. ఆ సమయంలో ఇక్కడి పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఆ తర్వాత ఎమ్మెల్యే కూడా ఆస్పత్రి నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఉదయం పది గంటల తర్వాతే వైద్య సేవలు

ఇక్కడి ఆస్పత్రిలో వైద్యులు కూడా అందుబాటులో ఉండడం లేదు. 24 గంటల పాటు ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉండగా ప్రతిరోజు ఉదయం పది గంటల తర్వాతే వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం వేళ ఎవరైనా అత్యవసర నిమిత్తం వైద్యం కోసం ఆస్పత్రికి వస్తే వైద్యులు లేరని, పది గంటల తర్వాత రావాలని కింది స్థాయి సిబ్బంది బదులిస్తున్నారు. ఎక్సరే మిషన్ ఏళ్లతరబడి మూలకు చేరినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఆస్పత్రి నిర్వహణపై ఎమ్మెల్యే గణబాబు స్పందించి ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెందుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి జంక్షన్ సమీపంలోని బీఆర్టీఎస్ రహదారిపై కడుపునొప్పి తాళలేక గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స అయన సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, ఆయన వివరాలు తెలిసినవారు 9440796039 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి వచ్చేనెల 13వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు తెలిపారు. ప్రతిరోజు ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా కర్పూర హారతి, నీరాట్ల ఉత్సవం, కూడారై ఉత్సవాలు, ముక్కోటి ఏకాదశి, శ్రీగోదా రంగనాథుల కల్యాణం జరుపుతామన్నారు.

పెన్షన్ సమస్యను పరిష్కరిస్తాం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉక్కు విశ్రాంత అధికారుల పెన్షన్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్టు ఛైర్మన్ హెచ్‌కే ఝా అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీ-భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటులో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పెన్షన్‌పై చేసిన, చేపట్టనున్న కార్యక్రమాలను వివరించి, న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ పూర్తి వేతనంపై పెన్షన్ ఇవ్వడానికి సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు స్టీల్‌ప్లాంట్‌లో అర్హులైన 2,984 మంది పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు డిమాండ్ నోటీసులు పంపించారని, ఇందులో పీఎఫ్ కార్యాలయం వారు సూచించినట్టుగా వడ్డీతో సహా రూ.410 కోట్లు చెల్లించారని పేర్కొన్నారు. ఇది జరిగి 14 నెలలవుతున్నా, ఈ ఏడాది మార్చిలో కేవలం పదిమందికి పెన్షన్ ఆర్డర్‌లు ఇచ్చారు కానీ పింఛన్లు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2:** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి(గాజువాక), లిఖిత (శ్రీహరి పురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 34, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 20, క్యారెట్ 70, దొండకాయలు 30, బంగాళదుంపలు 35, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 56, మునక్కాడలు (కిలో) 120, బరబాటి 24, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 32 దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 52, పొటల్స్ 44, కీరదోస 32, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 68, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, బూడిద గుమ్మడికాయ 30, బొప్పాయి 40, కర్రపెండలం 28, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	296
స్కిన్‌లెస్	206

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు


సదస్సుకు హాజరైన వారితో మాట్లాడుతున్న గణబాబు

ఎస్.ఎ.డి.జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నం మండల రెవెన్యూ పరిధిలోని బుచ్చిరాజుపాలెం రెవెన్యూ విలేజీ సమావేశాన్ని ఎస్ఎస్‌టీఎల్ గేటు వద్ద సోమవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ స్వార్థ ప్రయోజనాలే పరమావిధిగా అనేక భూ వివాదాలను సృష్టించిందన్నారు. అంతేకాక కొందరి భూములను బలవంతంగా భయపెట్టి లాక్కున్నారన్నారు. కొన్ని భూములను కావాలని 22-ఏలో పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని పేర్కొన్నారు. తాము నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు అన్ని విభాగాల అధికారులను తీసుకువచ్చి ప్రజల సమస్యలకు పరిష్కారాలను గడువు తేదీలోగా చూపిస్తామన్నారు. ఈ సదస్సులో ఇళ్ల పట్టాలు ఇప్పించాలని 25, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని 17తో పాటు మరో 17 వినతులను స్వీకరించినట్టు తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, స్టీల్‌ప్లాంట్ డిప్యూటీ కలెక్టర్ డీఎస్ సునీత, గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, దేవదాయశాఖ ఈవో శేఖర్ బాబు, డీటీ సువర్ణబాయి, ఆర్ఐ కోమలి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ నగర్ పార్కులో సదస్సు రేపు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్ పార్కులో ఈ నెల 11న రెవెన్యూ సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ శ్రీవల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

కార్యకర్తలే సంక్షేమమే టీడీపీ ధ్యేయం

86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ


సభ్యత్వ నమోదులో పాల్గొన్న నల్లూరు, తదితరులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా శ్రేయస్సుకు తెలుగుదేశం పార్టీ సేవలు ఎంతో అవసరమని 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు పరిధి వుడా నగర్‌లో సోమవారం చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదులో నియోజకవర్గంలో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్నామని, మొదటి స్థానం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, కనకరాజు, గణపతి, సుబ్బయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 71వ వార్డు పరిధి శ్రీరామ్ నగర్, సుందరయ్య కాలనీల్లో టీడీపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజాన రామారావు మాట్లాడుతూ రూ.100 టీడీపీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తతో పాటు కుటుంబానికి భద్రత, భరోసా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు, నాయకులు ప్రతాపరావు శ్రీనివాసరావు, కిశోర్ కుమార్, పోతురాజు, రవి, సురేశ్, శ్రీను, సాహు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి, పరసర ప్రాంతాల్లో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చురుగ్గా చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ టీడీపీ సభ్యత్వం పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. అనంతరం ఆయన పలువురికి సభ్యత్వాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరణం సత్యారావు, మాడిశ వెంకటరావు, గొల్లవిల్లి వెంకటరావు, సింగిడి సింహాచలం, రుద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంద్రంలో ప్రమాదం

మత్స్యకారుల బోటును ఢీకొన్న పర్యాటక శాఖ బోటు

త్రుటిలో తప్పిన ముప్పు

ప్రాణాలతో బయటపడిన మత్స్యకారులు, సందర్శకులు


ప్రమాదానికి కారణమైన పర్యాటక శాఖ బోటు, పక్కన దెబ్బతిన్న మత్స్యకారుల బోటు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో చేపలు వేట సాగిస్తున్న మత్స్యకారుల బోటును ఏపీ పర్యాటక శాఖ స్పీడు బోటు సోమవారం ఢీకొంది. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. జాలారిపేటకు చెందిన మత్స్యకారులు ఆర్.అప్పన్న, టి.గురునాథ్, వి.గణేశ్, నీలారావు, పోలారావు, పోలిరాజు జాలారిపేట నుంచి చేపల వేట సాగిస్తూ రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. అదే సమయంలో పర్యాటక శాఖ స్పీడు బోటు సందర్శకులతో తిరుగు ప్రయాణంలో వేగంగా వచ్చి మత్స్యకారుల బోటుపై నుంచి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో పర్యాటక శాఖ బోటులో ఇద్దరుండగా మత్స్యకారుల బోటులో ఆరుగురున్నారు. ఒక్కసారిగా జరిగిన హఠాత్పరిణామానికి మత్స్యకారులంతా బోటులో నుంచి నీటిలోకి దూకి ప్రాణాలతో బయట పడ్డారు. ప్రమాదం తరువాత పర్యాటక శాఖ స్పీడు బోటు డ్రైవర్ భయంతో ఇంకాస్త దూరం వెళ్లి మరో ప్రైవేట్ ఆపరేటర్‌కు చెందిన బోటును ఢీకొట్టాడు. బోటుకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. ప్రమాదంలో మత్స్యకారుల బోటు పాడయింది. ఈ విషయమై మత్స్యకారులు టూరిజం బోటు షికార్ మేనేజర్ రంజిత్‌ను నిలదీశారు. బోటుకు రూ.లక్ష నష్టం జరిగిందని చెల్లించాలని డిమాండ్ చేశారు. రుషికొండ బీచ్‌లోనే సరిచేసి ఇప్పిస్తామని టూరిజం శాఖ అధికారులు మత్స్యకారులకు చెప్పినా వినలేదు. చివరికి అధికారులు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. మెరైన్‌ఎస్ఐ మురళీకృష్ణ, ఆరిలోవ ఎస్ఐ రామదాసు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా మత్స్యకారులు టూరిజం ప్రాంతంలో వేట సాగిస్తుండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని టూరిజం సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్పీడు బోట్లను వేగంలో కంట్రోల్ చేయడం కష్టమని, మత్స్యకారులు అర్థం చేసుకుని బోటు షికార్ ప్రాంతంలో కాకుండా కాస్త దూరంలో చేపల వేట సాగించాలని కోరుతున్నారు. ఏపీ సంప్రదాయ మత్స్యకార కులాల సమాఖ్య కార్యదర్శి తెడ్డు శంకర్ మాట్లాడుతూ బోటు షికార్ పేరుతో స్పీడు బోట్లు నడుపుతున్న పర్యాటక శాఖ, ప్రైవేట్ వ్యక్తులు సంప్రదాయ మత్స్యకారులను రుషికొండ బీచ్ పరిసరాల్లో చేపల వేట సాగించవద్దని ఆంక్షలు పెట్టడం అన్యాయమన్నారు. బోటు ప్రమాదంపై కలెక్టర్ విచారణ జరిపించాలన్నారు.

ఇప్పటికీ ఇళ్లకు రిజిస్ట్రేషన్లు లేవాయె..

నేడు మల్కాపురంలో గ్రామ రెవెన్యూ సదస్సు

భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్న గ్రామ సంఘం ప్రతినిధులు

మల్కాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం గ్రామ రెవెన్యూ సదస్సు మంగళవారం స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో నిర్వహించేందుకు ములగాడ తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ప్రధానంగా నెలకొన్న భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం ప్రతినిధులు సిద్ధమయ్యారు. 1926-1927లో మల్కాపురంలో ఆయిల్ కంపెనీ నిర్మాణాన్ని చేపట్టేందుకు అప్పటి ఆంగ్లేయులు నిర్ణయించారు. అప్పటి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామస్థులను ఆయిల్ కంపెనీకి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించారు. ఈ మేరకు బ్రిటిష్ అధికారులు పోర్టు అధికారులచే సర్వే చేయించి 29 ఎకరాల 25 సెంట్ల భూమిని 1932లో గ్రామస్థుల కోసం కేటాయించారు. ఈ మేరకు స్థలాన్ని అన్ని హక్కులతో మల్కాపురం వాసులకు అందించాలి. కానీ అప్పటి అధికారులు ఇది పునరావాస ప్రాంతంగా కాకుండా పోర్టు స్థలంలో వీరంతా నివాసం ఉంటున్నట్టు రికార్డులలో నమోదు చేశారు. ఈ తప్పిదం వల్ల ఇప్పటికీ మల్కాపురంలో రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రభుత్వం కూడా ఇళ్ల పట్టాలను మంజూరు చేయలేదు. ఒకవేళ మంజూరు చేద్దామన్నా ఈ స్థలం పోర్టుకు చెందినట్టుగా రికార్డులలో చూపిస్తున్నందున ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు ప్రజలు జిల్లా కలెక్టర్‌లకు, మండల రెవెన్యూ అధికారులకు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఫలితం దక్కడం లేదు. ఇప్పుడు జరగనున్న రెవెన్యూ సదస్సు ద్వారానైనా తమకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి గీతా జయంతి వేడుకలు

పెందుర్తిరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని శ్రీకృష్ణ గీతా మందిరంలో మంగళవారం నుంచి 12వ తేదీ వరకు గీతా జయంతి వేడుకలను నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు తెలిపారు. పదో తేదీ ఉదయం ఐదు గంటల నుంచి స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, అనంతరం హనుమాన్ చాలీసా, భగవద్గీత పారాయణ ఉంటుందన్నారు. 11న గీతా హవనం, పూర్ణాహుతి, 12న ఏకాహం, భగవద్గీత సంపూర్ణ పారాయణ, మధ్యాహ్నం నారాయణ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

భక్తుల సందర్శనకు రామ ధనస్సు

అయోధ్యలో బాలరామచంద్రుడికి సమర్పించనున్న కోదండం (ధనస్సు) ఈ నెల 11న ఈ ప్రాంతానికి ప్రదర్శనగా రానున్నది. భక్తుల దర్శనార్థం ధనస్సును చింతలఅగ్రహారం రామాలయం, గీతా కృష్ణ మందిరాల్లో అందుబాటులో ఉంచుతామని ఆలయ కమిటీలు తెలిపాయి. ధనస్సుకు భక్తులు తెచ్చే పువ్వులతోనే పూజలు చేయాలని పేర్కొన్నాయి.

పాడి రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని వినతి

పెందుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ, అనకాపల్లి ఉమ్మడి జిల్లాలో గల పాడి రైతుల శ్రేయస్సు, అభ్యున్నతికి కృషి చేయాలని విశాఖ డెయిరీ హౌస్ కమిటీ ఛైర్మన్ జ్యోతుల నెహ్రూకు మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు కోరారు. విశాఖలో సోమవారం ఛైర్మన్‌ను కలిసి పాడిపై ప్రత్యక్ష, పరోక్షంగా ఏడు లక్షల మంది జీవనోపాధి పొందుతున్నారని వివరించారు. అందువల్ల గేదె పాల ధర లీటరు రూ.85, ఆవు పాల ధరను రూ.45గా చేయాలన్నారు. రైతులకు ఆరోగ్య, వైద్య బీమా సౌకర్యాలను కల్పించాలని వేడుకున్నారు.

'విశాఖ డెయిరీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీకి ఆడారి కుటుంబం ఒక నియంతలా వ్యవహరించిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శాసనసభా కమిటీకి తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి వినతిపత్రం అందజేశారు. అక్కిరెడ్డిపాలెంలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలానికి హాఫ్ పే చేసి బోర్డు నిర్మించుకోవడం జరిగిందని, పూర్వం ఇక్కడ క్రీడా మైదానం ఉండేదని పేర్కొన్నారు. విశాఖ డెయిరీ యాజమాన్యం మినిమం పొల్యూషన్ నిబంధనలను పాటించడం లేదని, 28 మంది వర్కర్లను సస్పెండ్ చేస్తే.. వారు కోర్టుకు వెళ్లి తమకు అనుకూలంగా తీర్పులను తెచ్చుకున్నా డెయిరీ యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ట్రస్టు ఆస్పత్రిని కిమ్స్ ఆస్పత్రికి ధారాదత్తం చేశారని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

కాలుష్యం నుంచి కాపాడాలి

విశాఖ డెయిరీ నుంచి విడుదల అవుతున్న జల, వాయు కాలుష్యాల నుంచి అక్కిరెడ్డిపాలెం పరిసర కాలనీల ప్రజలను రక్షించాలని శాసనసభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూకు సీపీఎం గాజువాక కమిటీ ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం కాలనీవాసులు వేడుకున్నారు. సోమవారం డెయిరీని సందర్శించిన శాసనసభా సంఘం ప్రతినిధులను వారు కలిసి సమస్యలను వివరించారు. డెయిరీ విడుదల చేస్తున్న వ్యర్థ జలాలతో పాటు కాలుష్యం వల్ల అక్కిరెడ్డిపాలెం పరిసర కాలనీల్లోని భూగర్భ జలాలు కాలుష్యమై ప్రజలు పలు అనారోగ్య సమస్యల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.రాంబాబు, ఎ.లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం నేడు ఇంటక్ ఆధ్వర్యంలో భారీ ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించేందుకు యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం టీటీఐ జంక్షన్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టనున్నట్టు యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు తెలిపారు. టీటీఐ జంక్షన్ వద్ద ఉదయం ఏడున్నర నుంచి తొమ్మిది గంటల వరకు ధర్నా చేస్తామని, అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.


జెడ్సీ శేషాద్రికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకుడు రట్టి వాసు, తదితరులు

పీజీఆర్ఎస్‌కు 21 వినతులు

గాజువాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 21 వినతులు వచ్చాయి. వీధిలైట్లు వెలిగించాలని, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, వీధి రోడ్లపై ఉన్న గోతులను పూడ్చాలని, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జోనల్ కమిషనర్ శేషాద్రి ఆదేశించారు. కాగా 65వ వార్డులో చాలా సమస్యలు ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ టీడీపీ వార్డు అధ్యక్షుడు రట్టి వాసు ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు, నాయకులు జెడ్సీకి వినతిపత్రం అందజేశారు.

జోన్-8లో ఫిర్యాదులు స్వీకరణ

వేపగుంట: గ్రేటర్ వేపగుంట జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ముఖ్యంగా 89వ వార్డు కొత్తపాలెం నుంచి సరవ వెళ్లే రోడ్డులో ఉన్న బాలాజీ నగర్‌లో డ్రేనేజీతో పాటు సీసీ రోడ్లను నిర్మించాలని, వేపగుంటలో వాటర్ పైపు లైన్‌కు మరమ్మతులు చేయాలని, చీమలాపల్లి ఏరియాలో పందుల సంచారం అధికంగా ఉందని, వాటిని అరికట్టాలని, వేపగుంట నుంచి పినగాడి రోడ్డును విస్తరించాలని, కృష్ణరాయపురం సర్వే నంబర్ 31/13లో 30 అడుగుల రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలని, పెందుర్తిలో సర్వే నంబర్ 261, 277లో 20 సెంట్ల ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపించి తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని జెడ్సీ కె.హైమావతి తెలిపారు.

సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు కీలక భూమిక పోషించాలి: ప్రభుత్వ విప్ గణబాబు

గోపాలపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు కీలక భూమిక పోషించాలని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. 91వ వార్డు పరిధి నేతాజీ వీధిలో సమగ్ర రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో స్వయం అభివృద్ధి సంఘాలకు రాయితీపై నిత్యావసర సరకులు పంపిణీ చేసే కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాకారత కోసం స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 300 మంది సంఘ సభ్యులకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కుమారస్వామి, సంస్థ ప్రతినిధులు బొడ్డేటి ఉమ, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉత్పత్తి పెంపునకు కృషి చేయాలి

సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి


రంజన్ మహంతిని సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఉత్పత్తిని మరింత పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి కోరారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్‌లో మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ లైజన్ అధికారి నల్ల సుందరం మాట్లాడుతూ ప్లాంట్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచిపేరు ఉందని, అందరి సహకారంతో స్టీల్ ప్లాంటును మరింత ముందుకు తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు తౌడన్న, ప్రతినిధులు ఎస్.సత్యనారాయణ, మోహన్‌బాబు, సాయిప్రసాద్, పుల్లారావు, ఫణీంద్రబాబు, వరప్రసాద్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డల్లోని పూడికలు తొలగింపు


పూడికలను తొలగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ప్రాంతంలోని ప్రధాన గెడ్డల్లో పూడికల తొలగింపు పనులను జీవీఎంసీ గాజువాక జోన్ ప్రజారోగ్యశాఖ అధికారులు చేపట్టారు. పూడికలు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు దిగువకు వెళ్లకపోవడంతో తీవ్ర దుర్వాసనతో పరిసరాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే దోమలు విజృంభణతో అనారోగ్యాలకు గురవుతున్నారు. పాతగాజువాక నుంచి చినగంట్యాడ, నడుపూరు, హౌసింగ్ బోర్డు కాలనీల నుంచి ప్రవహించే చాకలి గెడ్డ, స్టీల్‌ప్లాంట్ కేబీఆర్ నుంచి రామచంద్రా నగర్, బర్మాకాలనీ నుంచి పోర్టు బ్రిడ్జి కింద నుంచి సముద్రానికి కలిసే గెడ్డ, రాజీవ్ రోడ్డు, భానోజీ కాలనీ, వికాస్‌నగర్, పెదగంట్యాడ పారిశ్రామిక వాడల నుంచి సత్యనారాయణపురం నుంచి గంగవరం పోర్టు బ్రిడ్జివరకు ఉన్న గెడ్డల చుట్టుపక్కల ఉన్న ప్రజలు ఇలాంటి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలు జీవీఎంసీ అధికారుల దృష్టికి రావడంతో ఎక్స్‌కవేటర్ల సాయంతో సిబ్బంది పూడికలను తొలగిస్తున్నారు. వారం రోజుల్లోగా పూడికతీత పనులు పూర్తి కావచ్చని ప్రజారోగ్యశాఖ సిబ్బంది పేర్కొంటున్నారు.

దూదేకుల మహాజన గర్జన సభల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21 తేదీల్లో జరగనున్న దూదేకుల మహాజన గర్జన సభలకు సంబంధించిన చలో పెందుర్తి పోస్టర్‌ను సోమవారం గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నూర్ బాషా సంక్షేమ సంఘం ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనువాస్, పల్లా శ్రీనివాస్, బొడ్డు నరసింహపాత్రుడు, రౌతు శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి దేనంకొండ కృష్ణంరాజు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

అగనంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపుల్లో మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ తనిఖీ అధికారి కె.కల్యాణి హెచ్చరించారు. అగనంపూడి పరిసర ప్రాంతాల్లో గల మందుల షాపుల్లో సోమవారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని మందులను పరిశీలించడంతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. దుకాణాల్లో అనుమతి లేని డ్రగ్స్ విక్రయాలు సాగిస్తే షాపులను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కాలంచెల్లిన మందులను దుకాణాల్లో ఉంచడానికి వీల్లేదన్నారు. అధిక ధరలకు మందుల విక్రయాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయానికి ఫ్యాన్‌లు వితరణ

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల శ్రీవెంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానానికి పది ఫ్యాన్‌లు, ఇతర విద్యుత్ పరికరాలను ప్రముఖ వ్యాపారవేత్త కె.మంగరాజు సోమవారం ఆలయ సిబ్బందికి అందచేశారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ జి.రామునాయుడు, శ్రీను, రమేష్, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

11న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 11న నిర్వహించనున్నట్టు సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జడ్పీ సమావేశమందిరంలో చైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన ఐదు స్థాయీ సంఘ సమావేశాలు, చైర్‌పర్సన్ చాంబర్‌లో మరో రెండు సమావేశాలు జరుగుతాయన్నారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

సీతమ్మధార, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధారలోని గ్రీన్ గార్డెన్ వద్ద రోడ్డుకు ఇరువైపులా గ్రిల్స్‌ను నూతనంగా ఏర్పాటు చేసేందుకు అభివృద్ధి పనులను 'ఉత్తర' ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షలతో వార్డులో అభివృద్ధి పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ శివప్రసాద్, ఏఈ శ్రీనివాస్, బీజేపీ నాయకులు శ్యామల దీపిక, పరశురామ్‌రాజు, రాకేశ్, ధర్మారావు, శంకరరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ

సీతమ్మధార, డిసెంబరు 9: (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలో గల ఏఎస్‌ఎంసీహెచ్ జీవీఎంసీ ప్లస్ స్కూల్‌కు జోస్ అల్కాస్ ప్రతినిధులు 20 కుర్చీలు, 15 అల్మారాలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మాధవన్, శ్రీజిత్, పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అప్రంటీస్ మేళాకు స్పందన భేష్

కంచరపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ప్రభుత్వ పాత ఐటీఐలో సోమవారం నిర్వహించిన ఐటీఐ అభ్యర్థుల అప్రంటీస్ మేళాకు విశేష స్పందన లభించింది. మేళాలో కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీతో పాటు ఇతర ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా కంపెనీల్లో 225 ఖాళీలు ఉండగా 277 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను రెండు రోజుల్లో వెల్లడించనున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు.

టెక్కింగ్ పోస్టర్ ఆవిష్కరణ

అక్కయ్యపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకం కాలుష్యానికి పరిష్కారం అనే సంకల్పంతో ఈ నెల 15న ఆర్కే ఫిట్‌నెస్ మంత్ర జిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాధవధార హిల్ ట్రెక్కింగ్‌కు సంబంధించిన పోస్టర్, ఫ్లెక్సీని విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా, ఉల్లాసంగా ఉండాలన్నారు. అదే సమయంలో సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెల్లంకి భరత్ తదితరులు పాల్గొన్నారు.

దర్శనాలకు భక్తుల తాకిడి



అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

జగదాంబ కూడలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనాలకు వస్తున్నారు. పంచామృతాభిషేకం, అష్టదళ పద్మారాధన, 108 స్వర్ణ పుష్పాలతో అలంకరణ జరిపి పూజలు చేశారు. ఈవో కె.శోభారాణి పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనాలు జరిగాయి. ఉచిత ప్రసాద వితరణకు భక్తుల నుంచి స్పందన కనిపించింది.

పరిష్కార వేదికకకు మూడు అర్జీలు




అధికారులతో సమీక్షిస్తున్న జడ్సీ రాము

జ్ఞానాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అన్నారు.సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. లేకుంటే వారిపై చర్యలు తీసుకోవలసి వస్తుందన్నారు. సోమవారం ఉదయం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 3 వినతులు అందాయి. ఈఈ తారప్రసన్న, సూపరింటెండెంట్ రమణ, ఏఎంహెచ్‌ఓ సునీల్ కుమార్, ఆర్‌ఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆలోచనలను సన్మార్గంలో పెట్టి ఆచరించాలి

త్రిదండి చినజీయర్ స్వామి



ప్రసంగిస్తున్న చినజీయర్ స్వామి

సీతమ్మధార, డిసెంబరు 9: (ఆంధ్రజ్యోతి): మన ఆలోచనలను సన్మార్గంలో పెట్టుకుని ఆచరణలో పెట్టడం ద్వారా ప్రతికూల పరిస్థితుల్లో సైతం నెగ్గుకు రావచ్చని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. సీతమ్మధారలోని వర్మ కాంప్లెక్స్‌లో వారిజ, వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గీతా జయంతి వేడుకల్లో భాగంగా మూడో రోజు గీతామృత ప్రవచనాలను వినిపించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ ప్రతి జీవిలోనూ ఉన్నందున దానిని దేవాలయంగా భావించాలన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే మంచి లక్షణాలను అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని, పిల్లలు తప్పు చేస్తే ఆ దోషం వారిదేనన్నారు. దేవాలయాలు అత్యంత శక్తివంతమైన సాధన ఇచ్చే కేంద్రాలని, వీటిని వినియోగించుకుంటే మనిషి పూర్తి స్థాయిలో శక్తిమంతుడవుతాడని చినజీయర్ స్వామి పేర్కొన్నారు. యజ్ఞం కంటే చేసే ఇతర పనులు ఇక్కడ బంధాలు కోసమేనన్నారు. జీవితానికి పనికి వచ్చేది కేవలం యజ్ఞమేనని,మనిషి చేసే ప్రతి పనిలోనూ దైవత్వాన్ని చూడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణాన్ని పఠించారు. అనంతరం చినజీయర్‌స్వామి వారికి గీతా ప్రవచనాన్ని వినిపించారు.

రాష్ట్ర స్థాయి ఆక్వాటిక్ టోర్నీలో ప్రతిభ చూపిన స్విమ్మర్లు



పతకాలు సాధించిన స్విమ్మర్లతో సహాని, తదితరులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ టోర్నీలో జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సులోని ఎస్-3 స్విమ్మర్లు అద్భుతమైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను సంస్థ అధినేత సహని అభినందించారు. ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై, ఐఎం ఈవెంట్లలో ఎస్-3 స్విమ్మర్లు మొత్తంగా రెండు స్వర్ణ, నాలుగు రజత, ఐదు కాంస్య పతకాలను సాధించి ఎన్నో ఏళ్ల తర్వాత రాష్ట్ర స్థాయిలో విశాఖ జట్టు ఓవరాల్ రన్నరప్‌గా నిలివడం ప్రశంసనీయమన్నారు. ఈ టోర్నీలో గ్రూప్-1 బాలుర విభాగంలో ఎస్.జితేష్ నాయుడు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు, బాలికల విభాగంలో హిమశ్రీ మూడు రజత పతకాలు, రెండు కాంస్య పతకాలు సాధించారన్నారు. అలాగే గ్రూప్-3 బాలుర విభాగంలో ధీరజ్ ఒక స్వర్ణ, రెండు కాంస్య పతాలు సాధించినట్టు పేర్కొన్నారు. వీరంతా త్వరలో జరగనున్న సౌత్ జోన్ సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ టోర్నీలో ప్రతిభను కొనసాగించి పతకాలు సాధించాలని సహాని ఆకాంక్షించారు.

మత స్వేచ్ఛ ప్రాథమిక హక్కు

సీఆర్ఐఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కూచిపూడి బాబూరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాబూరావు

సీతంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత మతం, దైవారాధనలను రాజకీయాలతో ముడిపెట్టడం వల్ల దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే పరిస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేస్తూ... మత స్వేచ్ఛ ప్రాథమిక హక్కు అని విశ్రాంత ఐపీఎస్ అధికారి, సీఆర్ఐఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కూచిపూడి బాబూరావు అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రేమ్ తరంగ అధ్యక్షతన మత స్వేచ్ఛ-మన స్వేచ్ఛ అనే అంశంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా హాజరైన బాబూరావు మాట్లాడుతూ విభిన్న మతాలు, సంస్కృతులు గల మన దేశంలో అన్ని మతాలను గౌరవించడమే నిజమైన సెక్యులరిజం ఉద్దేశమని, రాజ్యాంగం ఇచ్చిన ఆర్టికల్-25 పౌరులందరికీ సమాన స్వేచ్ఛను ఇస్తుందన్నారు. దేశానికి మతం ఉండదని, అన్ని మతాలు సమానమేనని, చట్టం ముందు అందరూ ఒక్కటేనని పేర్కొన్నారు. మతాల మధ్య విభేదాలను పక్కనబెట్టి మానవత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. యువత సేవా రంగంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు, ఈ సమావేశంలో ప్రముఖ సామాజిక రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పులిగుజ్జు సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కోసం నూర్‌బాషా ముస్లింల వినతి



మహారాణిపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న నూర్‌బాషా ముస్లిం ప్రతినిధులు

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నూర్‌బాషా ముస్లింలకు శ్మశాన వాటికలు లేని చోట స్థలాన్ని కేటాయించి నిధులు మంజూరు చేయాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సేవా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం మహారాణిపేటలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో నూర్‌బాషా ముస్లింలు సుమారు 4 లక్షల కుటుంబాలు ఉంటున్నాయని, మరణిస్తే శ్మశాన వాటిక లేదని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మదరసాలలో ఉర్దూ టీచర్లను నియమించాలని, రంజాన్, బక్రీద్‌లకు ప్రార్థనా స్థలం ఇప్పించాలని కోరారు. మాంసం వ్యాపారులకు ఆరిలోవ, పెందుర్తి, తగరపువలస ప్రాంతాల్లో మేకల కబేలాలు ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యులు షేక్ నాగూర్, షేక్ బాబ్జి, షేక్ బ్రుహాన్, షేక్ బాబ్జి, షేక్ రహమాన్, హుస్సేన్, బాషా, మదీనా తదితర సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మానసిక రోగి

అక్కయ్యపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఆశ్రయం పొందుతున్న మానసిక రోగి షేక్ సమీ (38)ని భర్త బాషాకు సోమవారం అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు తెలిపారు. కాకినాడ సమీపం పెద్ద మామిడాడలో నివాసం ఉంటున్న సమీకి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ప్రేమ వివాహం చేసుకుని వెళ్లిపోవడాన్ని తట్టుకోలేక ఆమె మతిస్థిమితం కోల్పోయింది. ఈ క్రమంలో భర్తపై దాడి చేసి ఆమె విశాఖ వచ్చేసింది. ఏయూటీడీ సిబ్బంది సమీని సెప్టెంబరులో రైల్వే స్టేషన్‌లో గుర్తించి మూడు నెలల పాటు మానసిక ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించడంతో ఆమె కోలుకుంది. దీంతో ఆమె భర్త వివరాలు చెప్పడంతో బాషాకు అప్పగించారు.

బాక్సింగ్ విజేతలకు బహుమతులు అందజేత

అక్కయ్యపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ లీగ్-2 పోటీలను కైలాసపురం మధుసూదన్‌నగర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రొఫెషనల్ బాక్సర్లు పాల్గొనగా, 11 ఫైట్లు, 3 బెల్ట్ టైటిల్ పోరాటాలు జరిగాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు ముక్కా శ్రీనివాస్, ఐబీసీ సూపర్‌వైజర్ అజయ్ సాల్వి, ప్రతినిధులు వి.అమ్మోరు, గిరి పూర్వి, డాక్టర్ సునీ, మిస్టర్ ఆర్. ప్రవీణ్‌సింగ్, రూబెన్, డాక్టర్ జ్యోత్స్న తేజ, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే ఎల్‌ఐసీ నిర్వీర్యం'



ధర్నాలో మాట్లాడుతున్న అఖిల భారత వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్

డాబాగార్డెన్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఐఆర్‌డీఏఐ ద్వారా ఎల్‌ఐసీని నిర్వీర్యం చేసే విధానాలు ఆపాలని అఖిల భారత వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్ డిమాండ్ చేశారు. సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఎల్‌ఐసీ భవన్ వద్ద ఏఓఐ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన మంజునాథ్ మాట్లాడుతూ .కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులను పెంచే ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఎల్‌ఐసీలో ఐపీఓ ద్వారా షేర్లు అమ్మడం ద్వారా సంస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. 2047 నాటికి అందరికీ బీమా అందించాలని ఐఆర్‌డీఏఐ నూతన ప్రతిపాదనలో భాగంగా 2024 జనవరి 10న ఎల్‌ఐసీలో కొత్తమార్పు పేరుతో నూతన ప్రతిపాదనను ప్రవేశపెట్టిందన్నారు. దీనికి వ్యతిరేకంగా నవంబరు 10 నుంచి డిసెంబరు 10 వరకు అఖిల భారత కేంద్ర కమిటీ పిలుపుమేరకు ఎల్‌ఐసీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని డివిజన్ల ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నాకు పిలుపు ఇచ్చారన్నారు. వచ్చే ఫిబ్రవరి 11న లక్షలాది మందితో 'చలో పార్లమెంట్' కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో ఏజెంట్లు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ధర్నాకు ఎల్‌ఐసీ ఏఓఐ డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికిషోర్, ఎన్.రవీంద్రనాథ్ ఠాగూర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, త్రిమూర్తులు, అంజనేయులు, సత్తార్, శ్రీరాములు, ఏజెంట్లు పాల్గొన్నారు.

జనసేన కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాల సాధనకు అందరూ పనిచేయాలని పార్టీ శ్రేణులకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. సోమవారం జిల్లా పరిషత్ జంక్షన్‌లోని అంకోశా సమావేశమందిరంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల్లో మరణించిన 11 మంది జనసైనికుల కుటుంబాలను పరామర్శించి రూ.5 లక్షల వంతున బీమా చెక్కులను అందజేశారు. ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆరుగురికి రూ.25 వేల వంతున బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.28 కోట్ల మొత్తాన్ని ఇలాంటి బాధిత కుటుంబాలకు అందజేసి, వారికి భరోసా కలగజేశామన్నారు. అలాగే సోమవారం 54 మెట్రిక్ టన్నుల పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, జనసేన వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జులు శివప్రసాద్ రెడ్డి, పి.ఉషాకిరణ్, పంచకర్ల సందీప్, గంగులయ్య, జి.అప్పారావు, కార్పొరేటర్లు బీశెట్టి వంసతలక్ష్మి, కందుల నాగరాజు, డి.గోవింద్, పి.మూర్తి యాదవ్, జనసేన పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో సుదీర్ఘ చర్చ జరగాలి: హర్షకుమార్

డాబాగార్డెన్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో పార్లమెంట్‌లో సుదీర్ఘ చర్చ జరగడం ద్వారా పరిష్కారమార్గం దొరుకుతుందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అభిప్రాయపడ్డారు. పార్లమెంట్‌లో నూటికి నూరుశాతం దళిత ఎంపీలు గట్టిగా తమ గళం వినిపించాలని కోరారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల చేపట్టిన మాలల సింహ గర్జనలు విజయవంతం కావడమే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకమని తెలిపారు. ఈ నెల 15న గుంటూరులో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ తీర్పుపై పార్లమెంట్‌లో చర్చ జరిపి వెనక్కి తీసుకొనేలా అందరం కలిసికట్టుగా పోరాడాలన్నారు.

యువతీ యువకులకు సినీ గీతాల పోటీలు



సినీ గీతాల పోటీ ప్రచార పత్రికను ఆవిష్కరిస్తున్న విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు జి.రఘురామారావు తదితరులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సినీ సంగీత సేవా సంస్థ మెలోడి క్రియేటర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 9 గంటలకు 15 సంవత్సరాల నుంచి 25 ఏళ్లలోపు యువతీ, యువకులకు సెమీ క్లాసికల్ సినీ గీతాల పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రచార పత్రికను సోమవారం డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో ప్రముఖ వైద్యులు, విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు ఆవిష్కరించారన్నారు. యువతీ, యువకులను ప్రోత్సహించే దిశగా సినీ గీతాల పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం, విజేతలకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. పోటీల్లో పాలొనదలచినవారు ఈ నెల 15లోగా తమ పేర్లను సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణను 92466 22563 నెంబరుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు.

డెయిరీపై లోతుగా విచారణ

... 5వ పేజీ తరువాయి

కమిటీని నియమించిందన్నారు. ఇకపై విశాఖ డెయిరీని ప్రణాళికా బద్ధంగా నడిపే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

రైతులు, కార్మికులకు అన్యాయం చేస్తే ఉపేక్షించం

విశాఖ డెయిరీ రైతులకు, కార్మికులకు న్యాయం చేయడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ స్పష్టంచేశారు. డెయిరీలో విచారణ అనంతరం గేటు బయట దీక్ష చేస్తున్న కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ పురోభివృద్ధి చెందాలంటే పాడి రైతులు, కార్మికుల సేవలు అవసరమని, వారి విషయంలో ఎటువంటి అన్యాయం జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. కార్మికుల ఆందోళన, ఆవేదన చూస్తే యాజమాన్యం పెద్దగా స్పందించడం లేదన్న విషయం తెలుస్తుందన్నారు.

విచారణకు చైర్మన్ డుమ్మా

శాసనసభా కమిటీ సోమవారం డెయిరీలో విచారణకు వస్తున్న విషయం తెలిసినప్పటికీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ హాజరుకాలేదు. డెయిరీ ఎండీ ఎస్‌వీ రమణ, తొమ్మిది మంది డైరెక్టర్లు (మొత్తం 14 మంది డైరెక్టర్లు ఉన్నారు) మాత్రమే ఉన్నారు. డెయిరీపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఎండీ ఎస్‌వీ రమణ మాత్రమే సమాధానాలు ఇచ్చారు.

విదేశాలకు రేషన్ బియ్యం...

... 5వ పేజీ తరువాయి

అక్రమార్కులు అంచనాకు వచ్చారు. రెండు నెలల వ్యవధిలో ఏకంగా 70 వేల టన్నులు ఎగుమతి అయ్యాయంటే తప్పకుండా రేషన్ బియ్యమే అయి ఉంటాయని పౌర సరఫరాల అధికారుల అనుమానిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాలంటే ఎక్కడ నుంచి పోర్టుకు బియ్యం వచ్చాయనేది ఎగుమతిదారుడిని విచారించాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు.

పక్కా సమాచారంతో పోర్టుపై దాడి

విశాఖ పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతి అవుతున్నాయని పక్కా సమాచారం జిల్లా యంత్రాంగానికి వచ్చింది. వెంటనే నాలుగు బృందాలను ఏర్పాటుచేసి సోమవారం ఉదయం పోర్టు పరిధిలో గోదాముల తనిఖీకి పంపారు. ఒక చోట రేషన్ బియ్యం ఉన్నాయనే సమాచారం రావడంతో నగరంలోనే ఉన్న పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, జేసీ మయూర్ అశోక్‌తో కలిసి దాడులు చేశారు.

మాస్టర్ ప్లాన్

... 5వ పేజీ తరువాయి

వినియోగించుకునే వీలుంటుంది. లేనిపక్షంలో ఆ బాండ్‌లను ఇతరులకు విక్రయించి, ఆన్‌లైన్‌లో బదలాయింపు చేసుకునే అవకాశం ఉంటుంది. జీవీఎంసీ పరిధిలో ఇప్పటివరకూ కొత్తగా నిర్మించిన రోడ్లతోపాటు విస్తరించిన రోడ్లకు స్థల సేకరణ జరిగిన సందర్భాల్లో ఇదే విధానం అమలైంది. ఇప్పటికీ అదే విధానం అమలులో ఉంది. అయితే ఎండాడ నుంచి గీతం కాలేజీ మీదుగా బీచ్‌రోడ్డు వరకూ వంద అడుగుల రహదారి విస్తరణకు ఆ ప్రాంతంలో కొంత భూమిని సేకరించాల్సి ఉందని, టీడీఆర్ తీసుకునేందుకు యజమానులు విముఖత వ్యక్తంచేస్తున్నారు కాబట్టి వారికి నగదు పరిహారం చెల్లించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రతిపాదన తయారుచేశారు. రోడ్డు విస్తరణ కోసం తీసుకుంటున్న భూమికి పరిహారంగా యజమానులకు ఏకంగా రూ.10.93 కోట్లు చెల్లించేందుకు అనుమతివ్వాలంటూ ఈనెల 11న జరిగే కౌన్సిల్ సమావేశం ఎజెండాలో పొందుపరచడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

అవినీతికి తలుపులు తెరిచినట్టే...

టీడీఆర్ బాండ్‌లకు బదులుగా నగదు ఇవ్వడం ప్రారంభిస్తే అవినీతికి తలుపుతెరిచినట్టేనని కొంతమంది అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మునిసిపల్ చట్టంలో ఏదో మూలన నగదు పరిహారం చెల్లించేందుకు వెసులుబాటు ఉందంటూ...ఇంతవరకూ ఎప్పుడూ అమలుచేయని కొత్త సంప్రదాయానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు తెరతీయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. టీడీఆర్‌కు బదులుగా నగదు పరిహారం ఇస్తే భవిష్యత్తులో ఎవరూ బాండ్‌లు తీసుకోరని, అందరూ నగదు పరిహారమే కోరుతారని, అప్పుడు జీవీఎంసీకి వచ్చే ఆదాయం వారికి పంచిపెట్టడానికే సరిపోతుందని అభిప్రాయపడుతున్నారు. కొంతమంది అధికారులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఇలాంటి ప్రతిపాదనను తయారుచేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై కౌన్సిల్‌లో నిలదీయాలని ఇప్పటికే కూటమి కార్పొరేటర్లు తీర్మానం చేయడం విశేషం. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సంప్రదాయాన్ని అమలు చేయాలనే యోచనను స్వచ్ఛందంగానే విరమించుకోవాలని కోరుతున్నారు.

గంజాయిపై ప్రత్యేక నిఘా

... 5వ పేజీ తరువాయి

గుర్తించి చెక్‌పోస్టుల సంఖ్యను పెంచారు. అదేవిధంగా దువ్వాడ, పెందుర్తి వంటి నగర శివారు ప్రాంతాలతోపాటు రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలైన అల్లిపురం, జ్ఞానాపురం, రైల్వే న్యూకాలనీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సంబంధిత ప్రాంతానికి చెందిన పోలీసులను నగర పోలీస్ కమిషనర్ ఆదేశించారు.

గత నెలలో భారీగా పట్టుబడిన గంజాయి

గంజాయిపై గట్టిగా దృష్టిపెట్టడంతో గత నెలలో రవాణా, నిల్వ అభియోగాలపై 27 కేసులు నమోదుచేశారు. ఆయా కేసుల్లో ఏపీతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 53 మందిని అరెస్టు చేసి 452 కిలోల గంజాయి, ఎనిమిది కిలోల యాష్ ఆయిల్ (లిక్విడ్ గంజాయి), అర గ్రాము ఎండీఎంఏ మత్తు పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గత నెల 30న దువ్వాడలోని ఒక ఇంట్లో నిల్వ చేసిన 120 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసులో తమిళనాడుకు చెందిన నలుగురితోపాటు కొరియర్‌గా వ్యవహరించిన అల్లూరి సీతారామరాజు జిల్లా వాసిని అరెస్టు చేశారు. అలాగే 20 కిలోలు గంజాయిని తమిళనాడు తీసుకువెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్న ఆ రాష్ట్రానికి చెందిన ముగ్గురిని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పట్టుకున్నారు. దువ్వాడ మంగళపాలెం వద్ద బైక్‌పై 40 కిలోల గంజాయి తీసుకువెళుతున్న ముగ్గురిని దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు.

గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు

- శంఖబ్రత బాగ్చీ, పోలీస్ కమిషనర్

గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గంజాయి నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. ఎక్కడికక్కడ తనిఖీలు చేయడం వల్ల భారీగా గంజాయి పట్టుబడుతోంది. కొంతమంది వ్యాపారులు అద్దెకు ఇళ్లను తీసుకుని గంజాయి నిల్వ చేస్తున్నాసరే, యజమానులు గుర్తించడం లేదు. అద్దె ఎక్కువ వస్తుందనే ఆశతో గంజాయి స్మగ్లర్లకు ఇళ్లు ఇస్తున్న వారిపై కూడా చర్యలు తప్పవు. గంజాయి రవాణా, నిల్వ, విక్రయం సమాచారం ఎవరికైనా లభిస్తే 7995095799 నంబర్‌కు ఇవ్వొచ్చు.

సత్తా చాటిన నితీష్

... 5వ పేజీ తరువాయి

టీ20 సిరీస్‌లో భారత జట్టులో స్థానం పొంది ఆల్‌రౌండర్‌గా రాణించాడు. దీంతో ఆస్ట్రేలియా సిరీస్‌కు ఎంపికైన నితీష్‌కుమార్ తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 38 (నాటౌట్) పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర వహించాడు.

రెండో టెస్ట్‌లో కూడా తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లీ, రోహిత్‌శర్మ, కేఎల్ రాహుల్, పంత్, గిల్, జైశ్వాల్ వంటి టాప్ ఆర్డర్ ఒకరి తర్వాత పెవిలియన్‌కు బాటపడితే..ఏడో నంబరు బ్యాట్స్‌మన్‌గా క్రీజులోకి వచ్చిన నితీష్‌కుమార్ మరోసారి జట్టును ఆదుకునే బాధ్యత తీసుకున్నాడు. సహ బ్యాట్స్‌మెన్‌గా వచ్చినవారు వచ్చినట్టుగానే వెనుతిరుగుతున్నా... నితీష్ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో కేవలం 56 బంతుల్లో మూడు బౌండరీలు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేసి చివరి వికెట్‌గా అవుటయ్యాడు. రెండో ఇన్నింగ్స్‌లో కూడా టాప్ ఆర్డర్ విఫలమైనా...మరోసారి ఏడో నంబరు స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన నితీష్‌కుమార్‌రెడ్డి పోరాట స్ఫూర్తిని ప్రదర్శించి కేవలం 47 బంతుల్లో ఆరు బౌండరీలు, ఒక సిక్సర్‌తో 42 పరుగులు చేసి సత్తా నిరూపించుకున్నాడు. రెండో టెస్టులో పది వికెట్ల తేడాతో భారత్ ఘోర పరాజయం పాలైన...నితీష్‌కుమార్‌రెడ్డి ఆటతీరును ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ క్రికెటర్లు, అభిమానులు మెచ్చుకున్నారు. నాలుగు ఇన్నింగ్స్‌లలో 163 పరుగులు (సగటు 54కు పైగా) చేసిన నితీష్‌కుమార్‌రెడ్డి భారత్ జట్టులో అత్యధిక పరుగులు బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు.

కౌన్సిల్ సమావేశంలో పాలకపక్షం అవినీతిని ఎండగడదాం

... 5వ పేజీ తరువాయి

ప్రైవేటు వ్యక్తుల నుంచి గృహ నిర్మాణ సంస్థ తీసుకున్న భూమికి ప్రత్యామ్నాయంగా ముడసర్లోవ ప్రాంతంలో అత్యంత విలువైన భూమిని కేటాయించాలనే ప్రతిపాదనను అడ్డుకోవాలని నిర్ణయించారు. ఇంకా రూ.21 కోట్ల వ్యయంతో చేపడుతున్న స్వర్ణభారతి స్టేడియం అభివృద్ధి పనుల్లో అనేక లొసుగులు ఉన్నాయని, ఆయా పనులపై లోతుగా చర్చ జరపడంతోపాటు పూర్తి వివరాలను అధికారుల నుంచి రాబట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, బీజేపీ ఫ్లోర్‌లీడర్ గంకల కవిత, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంథం శ్రీనివాసరావుతోపాటు 40 మందికి పైగా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేడు మానవ హక్కుల దినోత్సవం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజవుతారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెందుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి జంక్షన్ సమీపంలోని బీఆర్టీఎస్ రహదారిపై కడుపు నొప్పి తాళలేక గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి వయస్సు 45 ఏళ్లు ఉంటాయని సీఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 9440796039 సెల్ నంబర్‌ను సంప్రతించాలని కోరారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే ఎల్ఐసీ నిర్వీర్యం'

డాబాగార్డెన్స్,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఐఆర్‌డీఏఐ ద్వారా ఎల్ఐసీని నిర్వీర్యం చేసే విధానాలు ఆపాలని అఖిల భారత వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్ డిమాండ్ చేశారు. సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఎల్ఐసీ భవన్ వద్ద ఏఓఐ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన మంజునాథ్ మాట్లాడుతూ .కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులను పెంచే ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఎల్ఐసీలో ఐపీఓ ద్వారా షేర్లు అమ్మడం ద్వారా సంస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. 2047 నాటికి అందరికీ బీమా అందించాలని ఐఆర్‌డీఏఐ నూతన ప్రతిపాదనలో భాగంగా 2024 జనవరి 10న ఎల్ఐసీలో కొత్తమార్పు పేరుతో నూతన ప్రతిపాదనను ప్రవేశపెట్టిందన్నారు. దీనికి వ్యతిరేకంగా నవంబరు 10 నుంచి డిసెంబరు 10 వరకు అఖిల భారత కేంద్ర కమిటీ పిలుపుమేరకు ఎల్ఐసీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని డివిజన్ల ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నాకు పిలుపు ఇచ్చారన్నారు. వచ్చే ఫిబ్రవరి 11న లక్షలాది మందితో 'చలో పార్లమెంట్' కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో ఏజెంట్లు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ధర్నాకు ఎల్ఐసీ ఏఓఐ డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికిషోర్,ఎస్.రవీంద్రనాథ్ ఠాగూర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, త్రిమూర్తులు, ఆంజనేయులు, సత్తార్, శ్రీరాములు, పాల్గొన్నారు.

11న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 11న నిర్వహించనున్నట్టు సీఈవో నారాయణమూర్తి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు జడ్పీ సమావేశమందిరంలో చైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన జరుగుతాయన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడీ, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 34, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 20, క్యారెట్ 70 దొండకాయలు30, బంగాళదుంపలు 35, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 24, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 32 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 68, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

గుంతలు.. ఆదమరిస్తే అంతే సంగతులు



కేఆర్ఎం కాలనీలోని రహదారిపై పడిన భారీ గుంత



చైతన్య నగర్ రహదారిలో పరిస్థితి ఇలా...

- అధ్వాన రహదారులతో స్థానికుల అవస్థలు
- కేఆర్ఎం కాలనీ, చైతన్యనగర్‌లో దుస్థితి

మద్దిలపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెం ప్రాంతంలో రహదారుల నిర్వహణను జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మద్దిలపాలెం, చైతన్యనగర్, కేఆర్ఎం కాలనీ ప్రాంతాల్లోని రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. అటుగా రాకపోకలు సాగించే వారు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్న ఈ గోతుల్లో పడిపోవడం ఖాయం. దీంతో ఆయా రోడ్లపై తిరగాలంటేనే స్థానికులు, వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. కేఆర్ఎం కాలనీ ఇరుకు రోడ్డు కావడంతో ఈ రోడ్డులో ప్రయాణం సాధారణంగానే ఇబ్బందిగా ఉంటుంది. ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చినా తప్పించుకోవడం కష్టంగా అనిపిస్తుంది. ఇప్పుడు ఆ రోడ్డులో ఎక్కడికక్కడ గుంతలు పడడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిపోయింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే చైతన్యనగర్‌లో మరిన్ని ఇబ్బందికర పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు, వృద్ధులు ఇటువైపు రావడానికి భయపడుతున్నారు. రోడ్డుపై, పక్కన పెద్ద గుంతలు ఉండడంతో ఏ గోతిలో పడి ప్రమాదం సంభవిస్తోందననే భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి, లేయర్ వేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

జూనియర్ ఆక్వాటిక్ పోటీల్లో ప్రతిభ



ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7, 8 తేదీల్లో జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్‌లో జరిగిన తొమ్మిదో ఏపీ వింటర్ సబ్ జూనియర్ అండ్ జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎంవీపీ కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారులు ప్రతిభ చూపారు. గ్రూప్ 1 బాలుర విభాగంలో జిషితేశ్ నాయుడు 50 మీటర్ల బటర్‌ఫ్లైలో రజతం, 100 మీటర్లలో బంగారం, 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్యం సాధించాడు. బాలికల విభాగంలో హిమశ్రీ 50 మీటర్లలో బటర్ ఫ్లై, ఫ్రీస్టైల్ విభాగాల్లో రజతం, ఫ్రీ స్టైల్‌లో 100, 200 మీటర్లలో కాంస్యం, 400 మీటర్లలో రజతం సాధించింది. గ్రూప్ 3 బాలుర విభాగంలో ధీరజ్ 50మీ ఫ్రీ స్టైల్‌లో బంగారం, 100మీ ఫ్రీ స్టైల్ కాంస్యం, 200 మీ ఇండివిడ్యువల్ మెడ్లీలో కాంస్యం సాధించాడు. మొత్తం బంగారం 2, రజతం 4, కాంస్యం 5 పతకాలు సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు.

ఏయూలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఏయూ రిజిస్ట్రార్, తదితరులు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏయూ పూర్వ విద్యార్థి, గ్లోబల్ లైఫ్‌సైన్సెస్ కన్సల్టింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ దేవా హెచ్ పురాణం సహకారంతో ఏయూ ఫార్మసీ కాలేజీ ఆవరణలో జిల్ పురాణం ఇన్‌స్ట్రుమెంటేషన్ ల్యాబ్‌ను ఏర్పాటుచేశారు. దీనిని సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవపురాణం వర్సిటీకి అందిస్తున్న సహకారం గొప్పదన్నారు. అనంతరం ల్యాబ్‌లో ఏర్పాటుచేసిన పరికరా లు, ఆధునికీకరించిన గదులను పరిశీలించారు. కార్యక్రమంలో అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఈశ్వర కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజాశంకర్, ఆర్అండ్‌డీ డీన్ ప్రొఫెసర్ కె.బసవయ్య, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరిలోవలో ఇసుక విక్రయాలు

స్టాక్ పాయింట్‌కు చేరిన 75 టన్నుల ఇసుక

ఆరిలోవ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముడసర్లోవ రిజర్వాయరు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీప జీవీఎంసీ స్థలంలో ఇసుక స్టాక్ పాయింట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ సోమవారం నుంచి విక్రయాలు ప్రారంభించాలని ఆదేశించినప్పటికీ, సమయానికి ఇసుక చేరుకోకపోవడంతో ఒకరోజు ఆలస్యంగా మంగళవారం నుంచి ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. శ్రీకాకుళం నుంచి సుమారు మూడు లారీలతో 75 టన్నుల ఇసుక సోమవారం సాయంత్రానికి చేరుకుంది. టన్ను ఇసుక రూ.700 చొప్పున విక్రయిస్తామన్నారు. ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విక్రయాలు చేపడతామన్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి, రశీదు తీసుకు రావాలని సైట్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిని నన్నపనేని ఎర్త్ మూవర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, అందరికీ ఇసుక అందుబాటులో ఉండేలా విక్రయాలు చేపడతామన్నారు. కాగా మరోవైపు తూనిక యంత్రాన్ని అమర్చే పనులు సాగుతున్నాయి.



స్టాక్‌పాయింట్ చేరిన ఇసుక నిల్వలు



ఏర్పాటుచేస్తున్న తూనిక యంత్రాలు

ఉత్తరాంధ్ర వాసులకు ఆయుర్వేద ఆస్పత్రి అవసరం

- త్రిదండి చినజీయర్ స్వామి



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న చినజీయర్ స్వామి, పాల్గొన్న భక్తులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర వాసులకు అన్ని వసతులతో కూడి ఆయుర్వేద ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని త్రిదండి రామానుజ చినజీయరు స్వామి అన్నారు. ఇందుకోసం తాను కృషి చేస్తానన్నారు. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టార్ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక అంశాలను ప్రవచించారు. సమీప ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

'అదానీ గ్రూపు కంపెనీల అవినీతిపై దర్యాప్తు జరపాలి'



నిరసనలో భాగంగా నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

సిరిపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదానీ గ్రూపు కంపెనీల అవినీతిపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు జరపాలని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలోని న్యూయార్క్ ఇస్ట్రాన్ జిల్లా కోర్టులో అదానీపై అవినీతి కేసు నమోదైందని తెలిపారు. తక్కువ గ్రేడ్ ఉన్న బొగ్గును ఎక్కువ నాణ్యత కలిగిన బొగ్గుగా చూపించి ధరలను అమాంతం పెంచి ప్రభుత్వ రంగ సంస్థలకు అమ్మడం వల్ల దేశ ప్రజలపై విద్యుత్ చార్జీలు భారం పడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జీఎస్‌జే అచ్యుతరావు, రెహమాన్, సత్యాంజనేయ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంద్రంలో ప్రమాదం

- మత్స్యకారుల బోటును ఢీకొన్న పర్యాటక శాఖ బోటు
- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



ప్రమాదానికి కారణమైన పర్యాటక శాఖ బోటు



ప్రమాదానికి గురైన మత్స్యకారులబోటు

సాగర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో చేపలు వేట సాగిస్తున్న మత్స్యకారుల బోటును ఏపీ పర్యాటక శాఖ స్పీడు బోటు సోమవారం ఢీకొంది. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. జాలారిపేటకు చెందిన మత్స్యకారులు ఆర్. అప్పన్న, టి. గురునాథ్, వి.గణేశ్, నీలారావు, పోలారావు, పోలిరాజు జాలారిపేట నుంచి చేపల వేట సాగిస్తూ రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. అదే సమయంలో పర్యాటక శాఖ స్పీడు బోటు సందర్శకులతో తిరుగు ప్రయాణంలో వేగంగా వచ్చి మత్స్యకారుల బోటుపై నుంచి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో పర్యాటక శాఖ బోటులో ఇద్దరుండగా మత్స్యకారుల బోటులో ఆరుగురున్నారు. ఒక్కసారిగా జరిగిన హఠాత్పరిమాణానికి మత్స్యకారులంతా బోటులో నుంచి నీటిలోకి దూకి ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదం తరువాత పర్యాటక శాఖ స్పీడు బోటు డ్రైవర్ భయంతో ఇంకాస్త దూరం వెళ్లి మరో ప్రైవేట్ ఆపరేటర్‌కు చెందిన బోటును ఢీకొట్టాడు. బోటుకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. ప్రమాదంలో మత్స్యకారుల బోటు పాడయింది. ఈ విషయమై మత్స్యకారులు టూరిజం బోటు షికార్ మేనేజర్ రంజిత్‌ను నిలదీశారు. బోటుకు రూ. లక్ష నష్టం జరిగిందని చెల్లించాలని డిమాండ్ చేశారు. రుషికొండ బీచ్‌లోనే సరిచేసి ఇప్పిస్తామని టూరిజం శాఖ అధికారులు మత్స్యకారులకు చెప్పినా వినలేదు. చివరికి అధికారులు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. మెరైన్ ఎస్ఐ మురళీకృష్ణ, ఆరిలోవ ఎస్ఐ రామదాసు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.కాగా మత్స్యకారులు టూరిజం ప్రాంతంలో వేట సాగిస్తుండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయని టూరిజం సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్పీడు బోట్లను వేగంలో కంట్రోల్ చేయడం కష్టమని, మత్స్యకారులు అర్థం చేసుకుని బోటు షికార్ ప్రాంతంలో కాకుండా కాస్తా దూరంలో చేపల వేట సాగించాలని కోరుతున్నారు. ఏపీ సంప్రదాయ మత్స్యకార కులాల సమాఖ్య కార్యదర్శి తెడ్డు శంకర్ మాట్లాడుతూ బోటు షికార్ పేరుతో స్పీడు బోట్లు నడుపుతున్న పర్యాటక శాఖ, ప్రైవేట్ వ్యక్తులు సంప్రదాయ మత్స్యకారులను రుషికొండ పరిసరాల్లో వేట సాగించవద్దని ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు.



ప్రాణాలతో బయటపడిన మత్స్యకారులు

డ్రైవర్ల కొరతే ప్రమాదాలకు కారణం

స్పీడు బోట్లు నడిపేందుకు గతంలో నలుగురు డ్రైవర్లు ఉండేవారు. ఫిషింగ్ హార్బర్‌లో ఒకరు, రుషికొండ బీచ్‌లో ముగ్గురు విధులు నిర్వహించేవారు. ఒకరిని గత ప్రభుత్వం విజయవాడకు బదిలీ చేయగా మిగిలిన ముగ్గురిలో ఒకరు అనారోగ్య సమస్య వల్ల తీరానికే పరిమితమయ్యారు. దీంతో ఇద్దరిపై పని ఒత్తిడి పెరగడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

టీటీడీ డైరీల విక్రయం ప్రారంభం



డైరీలు విక్రయిస్తున్న టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ హైమావతి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన 2025 సంవత్సరం డైరీల విక్రయాలను ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ప్రారంభించారు. రూ.150, రూ.120 ధరలతో డైరీలు అందుబాటులో ఉన్నాయని మేనేజర్ హైమావతి తెలిపారు. ఉదయం, సాయంత్రం విక్రయాలు సాగుతాయని, రూ.120 డైరీలు తక్కువ సంఖ్యలో, మిగిలినవి ఎక్కువ సంఖ్యలో ఉన్నాయని తెలిపారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం కూడదు



అర్జీలను స్వీకరిస్తున్న చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ ప్రజాదర్బార్‌కు వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించే దిశగా కృషిచేయాలని నిర్లక్ష్యం వహించరాదని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో చైర్మన్, కమిషనర్ అర్జీలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మొత్తం 16 మంది బాధితులు పాల్గొనగా ఇంజనీరింగ్ 2, ప్లానింగ్ 5, రెవెన్యూ 5 ఇతర విభాగాలకు చెందిన సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, విభాగాధిపతులు భవానీశంకర్, శిల్ప, హరిప్రసాద్, శివానీ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజమే ధ్యేయం



అవినీతికి వ్యతిరేకంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ

రామ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని, అవినీతి, లంచగొండితనంపై యువత, విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించాలని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అవినీతి నిరోధం మన దేశం నుంచే ప్రారంభం కావాలని, ఉత్తమ సమాజాన్ని స్థాపించాలన్నారు. దేశం వెనుకబాటుతనానికి లంచగొండి తనం, అవినీతి ప్రధాన కారణాలన్నారు. వీటిని పారదోలితే దేశం ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం అవినీతి రహిత సమాజానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ ఈ కార్యక్రమంలో అవినీతి నిరోధకశాఖ కమిషనర్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అవినాష్, రాజన్ నాగేంద్రబాబు, బీవీ రమేష్‌కుమార్, బోలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఆస్ట్రేలియా వర్సిటీ విద్యార్థులు



ఏయూ వీసీ, ఇతర అధికారులతో ఆస్ట్రేలియా వర్సిటీ విద్యార్థులు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో ఉన్న విక్టోరియా యూనివర్సిటీ విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. విక్టోరియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మర్సిల్లె కాసియోటోలో, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ విభాగం డైరెక్టర్ గ్రెగ్ అరోన్సెన్, అన్నే మేరీ నేతృత్వంలోని విద్యార్థుల బృందం వీసీని కలిసింది. రెండు విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సహకారంపై చర్చించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ టి.షారోన్‌రాజు, కేథరిన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇవాంజెలిన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దగ్ధం కేసులో ఇద్దరు అరెస్ట్

భీమునిపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్ మార్లిన్ కే సమీపంలో రహదారి పక్కన పార్కింగ్ చేసిన బైక్ దగ్ధం కేసులో సోమవారం ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ హరీష్ తెలిపారు. ఎగువపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కుప్పా శ్రీనివాసరావు తన కుమార్తెను వేధిస్తున్నందున అదే ప్రాంతానికి చెందిన కారి లోకేశ్ (28) బైక్‌ను ఆదివారం దగ్ధం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీనివాసరావును అరెస్ట్ చేశారు. అలాగే యువతిని వేధిస్తున్నాడన్న ఫిర్యాదు మేరకు లోకేశ్‌ను కూడా అరెస్టు చేశారు. ఇద్దరినీ సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు.

జనసేన కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాల సాధనకు అందరూ పనిచేయాలని పార్టీ శ్రేణులకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. సోమవారం జిల్లా పరిషత్ జంక్షన్‌లోని అంకోశా సమావేశమందిరంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల్లో మరణించిన 11 మంది జనసైనికుల కుటుంబాలను పరామర్శించి రూ.5 లక్షల వంతున బీమా చెక్కులను అందజేశారు. ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆరుగురికి రూ. 25 వేల వంతున బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.28 కోట్ల మొత్తాన్ని ఇలాంటి బాధిత కుటుంబాలకు అందజేసి, వారికి భరోసా కలగజేశామన్నారు. అలాగే సోమవారం 54 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, జనసేన వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జులు శివప్రసాద్ రెడ్డి, పి.ఉషాకిరణ్, పంచకర్ల సందీప్, గంగులయ్య, జి.అప్పారావు, కార్పొరేటర్లు బీశెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు, డి.గోవింద్, పి.మూర్తి యాదవ్, జనసేన పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

యువతీ యువకులకు సినీ గీతాల పోటీ

డాబాగార్డెన్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సినీ సంగీత సేవా సంస్థ మెలోడి క్రియేటర్స్ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం 9 గంటలకు 15 సంవత్సరాల నుంచి 25 ఏళ్లలోపు యువతీ, యువకులకు సెమీ క్లాసికల్ సినీ గీతాల పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రచార పత్రికను సోమవారం డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో ప్రముఖ వైద్యులు, విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి. రఘురామారావు ఆవిష్కరించారన్నారు. పూర్తి వివరాలకు 92466 22563 నెంబరును సంప్రతించాలని కోరారు.

హక్కులకు కొరవడిన రక్షణ!



విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): **సగటు మానవుడి ప్రశాంత జీవనానికి భరోసాను కల్పించేవి మానవ హక్కులు. ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాల్లో కుల, మత, రాజకీయపరమైన వివక్షతో ప్రజలు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో మానవులందరికీ సమాన హక్కులను కల్పించాలని భావించి, 1948లో ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధుల సభ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. దాని ప్రకారం యూఎన్‌వోలోని సభ్య దేశాలన్నీ ఈ హక్కులను అమలు చేయాల్సి ఉంటుంది.**

ప్రపంచ వ్యాప్తంగా యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన

- రక్షణ, స్వేచ్ఛ కల్పించే ఉద్దేశంతో అమలు
- చట్టబండలుగానే పరిరక్షణ కమిషన్లు, ప్రభుత్వాలు
- ఇప్పటికీ కొనసాగుతున్న వివక్ష, వేధింపులు
- ఈ ఏడాది థీమ్ 'మన హక్కులు - మన భవిష్యత్'

నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

ప్రపంచంలోని అనేక దేశాల్లో కక్షలు, కార్పణ్యాలు, జాతి, మత వివక్ష కారణంగా ఇబ్బందులు పడుతున్న అనేకవర్గాల ప్రజలకు ఈ హక్కులు రక్షణగా నిలుస్తాయని ఐక్యరాజ్య సమితి భావించింది. అందుకు అనుగుణంగా 1948 డిసెంబరు పదో తేదీన విశ్వ మానవ హక్కుల ప్రకటనను చేసింది. ఇవి అమల్లోకి వచ్చిన రోజునే ఏటా మానవ హక్కుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. వాటిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఏటా ప్రత్యేక థీమ్‌తో జరుపుకునే ఈ దినోత్సవాన్ని ఈ ఏడాది 'మన హక్కులు.. మన భవిష్యత్' థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

ఇవీ మానవ హక్కులు..

ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధుల సభ తీర్మానం ప్రకారం జాతి, వర్ణ, లింగ, కుల, మత రాజకీయ, తదితర కారణాలతో వివక్షకు గురికాకుండా ఉండే హక్కు, చిత్రహింసలు, క్రూరత్వం నుంచి రక్షణ పొందే హక్కు, వెట్టిచాకిరీ, బానిసత్వం నుంచి రక్షణ పొందే హక్కు, సరైన కారణం లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా ఉండే హక్కు, స్వేచ్ఛగా స్వదేశంలో, విదేశాల్లో పర్యటించే హక్కు, అభియోగం ఆపాదించిన సందర్భంలో పక్షపాత రహితంగా విచారణ పొందే హక్కు, సురక్షిత ప్రాంతాల్లో ఏకాంతంగా జీవించే హక్కు, విద్యాహక్కు, పిల్లలు ఆడుకునే హక్కు, జీవించే హక్కు, జాతీయత హక్కు, ప్రజాస్వామ్య హక్కు వంటివన్నీ మానవ హక్కుల కిందకు వస్తాయి.

ఈ హక్కులకు భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, న్యాయం పొందవచ్చు.

యథేచ్ఛగా ఉల్లంఘన..

ఐక్యరాజ్య సమితిలోని సభ్య దేశాలన్నీ మానవ హక్కులను అమలుచేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. అనేక దేశాల్లో ప్రజలు జీవించే హక్కును కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. యుద్ధ వాతావరణం, ఉగ్రమూకల దాడులతో మానవాళి జీవించే హక్కును కోల్పోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఐక్యరాజ్యసమితి ఉండిపోయింది. మన దేశంలోనూ ఇటువంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత కొన్నాళ్లుగా ప్రభుత్వాలు నిరంకుశంగా వ్యవహరిస్తూ మానవ హక్కులను కాలరాస్తున్నాయనే విమర్శలున్నాయి. ప్రభుత్వాలపై వ్యాఖ్యలు చేసిన వారిపై తప్పుడు కేసులు పెట్టి, వేధింపులకు గురిచేస్తూ మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. ఇప్పటికీ అనేకచోట్ల పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలున్నాయి. వీటిపై పోరాటం చేసే పరిస్థితి కూడా లేకపోతోంది. ఇప్పటికీ ఎంతోమంది చిన్నారులు చదువుకునే అవకాశం లేక బాల కార్మికులు, వెట్టి కూలీలుగా మారిపోయారు. వీరికి ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన హక్కులు ఎలాంటి రక్షణ కల్పించడం లేదు. అనేక ప్రాంతాల్లో కుల, మత వివక్షను ఎదుర్కొంటున్నవారి సంఖ్య భారీగానే ఉంది. మానవ హక్కులుగా పేర్కొంటున్నవి చాలావరకు అమలు కాకపోవడం గమనార్హం. వీటి అమల్లో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన ప్రభుత్వాలు, కమిషన్లు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడమే ఈ పరిస్థితికి కారణమనే విమర్శలున్నాయి.



అప్పన్న ఆలయంలో 13 వరకు ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో తిరుమంగై ఆళ్వార్ తిరు నక్షత్ర పూజలు 13 వరకు జరగనుండడంతో ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఈఓ వేంద్ర త్రినాథరావు ప్రకటించారు. అలాగే ఈనెల 15న స్వామివారి ఆలయంలో వృశ్చిక దీపారాధన జరగనున్నందున ఆ రోజు రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 218 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్య ల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి 218 వినతులు అందినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూ 97, జీవీఎంసీ 50, పోలీసు 13, ఇతర శాఖలకు సంబంధించి 58 అర్జీలు ఉన్నట్లు పేర్కొన్నా రు. దరఖాస్తుల పరిష్కారంలోఅధికారులు మరింత శ్రద్ధ చూపాలని, పదిరోజుల్లోగా శాశ్వత పరిష్కారం చూపాలని, సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలపై జిల్లాస్థాయి అధికారులు స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవాని శంకర్, శేష శైలజ, వర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువకుడి మరణంపై విచారణ జరపాలి'

విశాఖ సెంట్రల్ జైల్‌లో జులై 30న జరిగిన దళిత యువకుడు ఉప్పాడ గౌరీ శంకర్ మరణంపై మెజిస్టీరియల్ విచారణ జరపాలని విదసం ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆనందపురానికి చెందిన గౌరీశంకర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు జైలు అధికారులు ప్రకటించారని తెలిపారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సన్ ఇనిస్టిట్యూట్‌పై ఫిర్యాదు

ప్రభుత్వ గుర్తింపు లేకుండా నడుపుతున్న సన్ ఇన్‌స్టిట్యూట్‌పై చర్యలు తీసుకోవాలని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. పెందుర్తి సుజాతనగర్‌లో సన్ ఇన్‌స్టిట్యూట్ అగ్రికల్చర్ అండ్ సైన్సెస్ పేరుతో ప్రభుత్వ గుర్తింపు లేకుండా అనధికారికంగా అగ్రికల్చర్ ఫిజియోథెరపీ పారా మెడికల్ కళాశాల నడుపుతున్నారని, విద్యార్థులనుంచి రూ.లక్షలు ఫీజు వసూలుచేస్తున్నారని, విచారణ జరిపి సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసు కమిషనరేట్‌లో 103 ఫిర్యాదులు

మహారాణిపేట: పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 103 ఫిర్యాదులు స్వీకరించారు. కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటానికి సిద్ధంకండి

- ఉమ్మడి విశాఖ జిల్లా నేతలతో ఎమ్మెల్సీ బొత్స


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన ఆరునెలల్లోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని, ఇకపై ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా పార్టీపరంగా పోరాటాలకు అందరూ సిద్ధంకావాలని మాజీ మంత్రి, శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. లాసన్స్‌బేకాలనీలోని క్యాంప్‌కార్యాలయంలో సోమవారం ఆయన ఉమ్మడివిశాఖ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, మాజీఎమ్మెల్యేలు, జడ్పీటీసీ, ఎంపీటీసీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు ప్రభుత్వంపై పోరాటాలు చేయాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళనలు, నిరసనలకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ సమావేశంలో అరకు, పాడేరు ఎమ్మెల్యేలు రేగా మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీపై అనుకూల, ప్రతికూల వాదనలు


కలెక్టరేట్ వద్ద విశాఖ డెయిరీ పాల రైతులు

మహారాణిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణకు సోమవారం కలెక్టరేట్‌కు హౌస్ కమిటీ వచ్చి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డెయిరీకి అనుకూలంగా, ప్రతికూలంగా ఫిర్యాదులు చేయడానికి రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు వచ్చారు. డెయిరీ వల్ల తామంతా అభివృద్ధి చెందామని విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలోని పాల సంఘాల సభ్యులు హౌస్ కమిటీకి వినతిపత్రం అందజేశారు. వీరితోపాటు ఆడారి తులసీరావు కుమార్తె, ఎలమంచిలి మునిసిపాలిటీ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి కలెక్టరేట్‌కు రావడం గమనార్హం. కాగా డెయిరీకి సరఫరాచేసే పాల ధరలు పెంచాలని హౌస్‌కమిటీకి ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం సభ్యులు కోరారు. డెయిరీలో అవినీతిపై స్వతంత్ర సంస్థతో విచారణ చేపట్టాలని, అన్యాక్రాంతమైన ఆస్తులు వెనక్కి తీసుకోవాలని, డెయిరీకి పాలు మిగులు ఉన్న సమయంలో స్థానికంగా అమ్మకాలకు అనుమతించాలని కోరారు.

సామాజిక పింఛన్ల అర్హత తనిఖీ

- ఇందిరానగర్-1 సచివాలయంలో 265 పింఛన్‌దారుల వివరాలు సేకరణ


పింఛనుదారుల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-4 ఇందిరాకాలనీ-1 సచివాలయం పరిధిలో 265 సామాజిక పింఛన్లను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. పింఛన్‌దారులలో అనర్హులున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో పైలట్ ప్రాజెక్టు కింద జోన్-4 ఇందిరాకాలనీ-1 సచివాలయం పరిధిలో ఉన్న 265మంది పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి విచారించారు. జీవీఎంసీ యూసీడీ, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బందితో తొమ్మిది బృందాలను నియమించారు. డీఆర్‌డీఏ పీడీ లక్ష్మిపతి సారథ్యంలో ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. ప్రతి ఒక్కరికి బయోమెట్రిక్‌తోపాటు ఫొటోలు తీసుకుని ప్రభుత్వ పోర్టల్‌కు అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వం రూపొందించిన సిక్స్‌టెప్ వాలిడేషన్ మేరకు పింఛన్‌దారులు కుటుంబ వివరాలున్నాయా? లేవా అనేది వీరిలో ఎవరైనా అనర్హులున్నారా? అన్నది ఇప్పుడే తేలదని అధికారులు తెలిపారు.

విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ-సికింద్రాబాద్, బ్రహ్మపూర్-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

07097 నంబర్ గల ప్రత్యేక రైలు ఈ నెల 15, 22, 29 సాయంత్రం 4.35 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 6.30 కు విశాఖ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07098 నంబర్‌తో 16, 23, 30 తేదీల్లో రాత్రి 7.50కు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 11.15కు సికింద్రాబాద్ చేరుతుంది.

సికింద్రాబాద్-బ్రహ్మపూర్

07027 నంబర్ గల ప్రత్యేక రైలు ఈ నెల 13, 20, 27 తేదీల్లో రాత్రి 8.15 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం9.22కు దువ్వాడ, మధ్యాహ్నం 2.45కు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07028 నంబరుతో 14, 21, 28 తేదీల్లో సాయంత్రం 4.45కు బ్రహ్మపూర్‌లో బయలుదేరి రాత్రి 9.55కు దువ్వాడ, మర్నాడు 11.35 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

అప్పన్నను దర్శించుకున్న నేవీ వైస్ అడ్మిరల్


కప్ప స్తంభం వద్ద కపూర్ దంపతులు

సింహాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామిని సోమవారం కంట్రోలర్ ఆఫ్ లాజిస్టిక్స్ ఏవీఎస్ఎం (నేవీ ఆఫీసర్) వైస్ అడ్మిరల్ దీపక్ కపూర్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

హుండీ ఆదాయం రూ. 2.81 కోట్లు

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామికి గత 39 రోజులకు గాను హుండీల ద్వారా సుమారు రూ.2.81కోట్ల ఆదాయం సమకూరింది. ఈఓ వేంద్ర త్రినాథరావు పర్యవేక్షణలో పరకామణి కేంద్రంలో సోమవారం హుండీల లెక్కింపు చేపట్టారు. రూ.2,81,93,913 నగదు , 126.3 గ్రాముల స్వర్ణం, 15.14 కిలోల రజితం, 285 యూఎస్ఏ, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 20 ఇంగ్లాండు పౌండ్లు, 10 సింగపూర్ డాలర్లు, 146 ఖతార్ రియల్స్, 1000 నైజీరియా నైరాలు, 165 యూఏఈ దీరమ్స్, కెనడా, మలేషియా దేశాల కరెన్సీ లభించింది. డిప్యూటీ ఈఓ ఎస్. రాధ,ఈఈలు ఏఈఓలు పాల్గొన్నారు.

గీతంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ రేపు

సాగర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలోని యువతలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఈనెల 11న నిర్వహించనున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు గీతం యూనివర్సిటీ ఆతిథ్యం ఇవ్వనుంది. గీతంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న మరో 50 వర్సిటీల్లో ఐఐటీల్లో జరిగే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌ను కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. గీతంలో జరిగే కార్యక్రమానికి దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 29 విద్యార్థి బృందాలు పాల్గొనున్నాయని పోటీలకు విశాఖ పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తున్న బి.రాజ్ కుమార్ తెలిపారు. 17 అంశాలపై విద్యార్థుల నుంచి నూతన పరిష్కారాలను, ఆలోచనలను ఆహ్వానించగా గీతం పోటీల్లో పాల్గొనే జట్లు బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ, విపత్తుల నిర్వహణ, స్మార్ట్ ఎడ్యుకేషన్, రెన్యువబుల్ ఇంజనీరింగ్ అంశాలపై తమ ఆలోచనలను ప్రజెంటేషన్ చేయడానికి ముందుకు వచ్చాయని ఆయన తెలిపారు.